ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 31.0
కనిష్ఠం 23.8

ANDHRAJYOTHY

నల్లగొండ

5

మంగళవారం 30 సెప్టెంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	585.30 (298.3005)	5,91,456	5,91,456
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.47 (4.06)	9,152.18	7,994.18
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	169.814	5,92,610	5,69,340

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.210



మోగిన స్థానిక సంస్థల ఎన్నికల నగారా

స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగింది. రెండు విడతల్లో పరిషత్ ఎన్నికలు, మూడు విడతల్లో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. రాష్ట్రంలోనే అతిపెద్ద జిల్లా అయిన నల్లగొండలో అదే స్థాయిలో ఎన్నికలు నిర్వహించేందుకు కలెక్టర్ ఇలా త్రిపాఠి నేతృత్వంలో అధికారయంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

జడ్పీటీసీ స్థానాలు	33
ఎంపీటీసీ స్థానాలు	353
పోలింగ్ స్టేషన్లు	1957
పంచాయతీలు	869
వార్డులు	7494
పురుష ఓటర్లు	5,30,860
మహిళా ఓటర్లు	5,42,589
ఇతరులు	57
మొత్తం ఓటర్లు	10,73,506

- ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేసిన యంత్రాంగం
- ప్రవర్తనా నియమావళి అమలులోకి
- అక్టోబరు 9 నుంచి నవంబరు 11 వరకు ఎన్నికల సందడి

జిల్లాలో 33 జడ్పీటీసీ స్థానాలకు, 353 ఎంపీటీసీ స్థానాలకు రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. 869 గ్రామపంచాయతీల్లో 7,494 వార్డులకు మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం ఐదు దశల ఎన్నికలకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. దసరా తర్వాత అక్టోబరు 9వ తేదీన పరిషత్ ఎన్నికల మొదటి విడత నోటిఫికేషన్ విడుదలతో నామినేషన్ల ఘట్టం ప్రారంభమై, నవంబరు 11న జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల ఓట్ల లెక్కింపు పూర్తయ్యేంతవరకు జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉండనుంది. ఈ ఎన్నికల్లో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం 10,73,506 మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల ఎన్నికలకు ఉదయం 7నుంచి సాయంత్రం 5గంటలవరకు పోలింగ్ నిర్వహించనుండగా, గ్రామపంచాయతీ సర్పంచ్,వార్డు సభ్యుల పోలింగ్‌ను ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2గంటలకు ముగిస్తారు. పంచాయతీ ఎన్నికల్లో అదే రోజు ఓట్ల లెక్కింపు చేపడతారు.

రెండు విడతల్లో పరిషత్ ఎన్నికలు

జిల్లాలో పరిషత్ ఎన్నికలు రెండు విడతల్లో నిర్వహించనున్నారు.మొదటి విడతలో నల్లగొండ, దేవరకొండ డివిజన్లలోని 18 జడ్పీటీసీ,196 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. రెండో విడతలో చండూరు, మిర్యాలగూడ డివిజన్లలోని 15జడ్పీటీసీ, 157 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు పోటీచేసే అభ్యర్థుల నామినేషన్లను మండల పరిషత్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసే ఎన్నికల అధికారి తీసుకుంటారు.

మూడు విడతల్లో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు

గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహిస్తారు. మొదటి విడతలో నల్లగొండ, చండూరు డివిజన్లలోని 14 మండలాల్లోని 318 పంచాయతీలు, 2,870 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తారు. రెండో విడతలో మిర్యాలగూడ డివిజన్‌లోని 10 మండలాల్లోని 282 గ్రామపంచాయతీలు, 2,418 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. మూడో విడతలో దేవరకొండ డివిజన్‌లోని తొమ్మిది మండలాలకు 269 గ్రామ పంచాయతీలు, 2,206 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తారు.

పోలింగ్ సిబ్బంది నియామకాలు..

జిల్లాలో పరిషత్ ఎన్నికలకు జడ్పీటీసీస్థానాలకు ఒక్కో స్థానానికి ఒక్కొక్కరు చొప్పున 33మంది రిటర్నింగ్..

మిగతా 8వ పేజీలో...

పరిషత్ ఎన్నికలు రెండు విడతల్లో..

విడత	నామినేషన్ల స్వీకరణ	నామినేషన్ల పరిశీలన	అభ్యంతరాల స్వీకరణ	నామినేషన్ల ఖరారు	నామినేషన్ల ఉపసంహరణ	పోలింగ్ తేదీ	మండలాలు స్థానాలు	జడ్పీటీసీ స్థానాలు	ఎంపీటీసీ స్థానాలు	మొత్తం ఓటర్లు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	పోలింగ్ కేంద్రాలు
తొలి	అక్టోబరు 9	12న	13న	14న	15న	23న	18	18	196	6,00,316	2,98,048	3,02,241	1,099
రెండో	అక్టోబరు 13	16న	17న	18న	19న	27న	15	15	157	473190	2,32,812	2,40,348	858

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి



స్థానిక ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్‌లో రాణీ కుముదిని,పాల్గొన్న కలెక్టర్

రాష్ట్ర ఎన్నికల అధికారి రాణికుముదిని

నల్లగొండ(కలెక్టరేట్), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి: స్థానిక సంస్థలకు రెండు విడతల్లో ఎన్నికలు ఉంటాయని, ఎన్నికల కోడ్ కూడా అమలులో ఉంటుందని రాష్ట్ర ఎన్నికల అధికారి రాణికుముదిని అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో రెండు దఫాలుగా పరిషత్ ఎన్నికలు, మూడు దఫాలుగా సర్పంచ్ ఎన్నికలు ఉంటాయన్నారు. స్థానిక ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకొని సిద్ధంగా ఉండాలని, ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణకు 996 బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉన్నాయని, ఆర్‌వో, ఏఆర్‌వోలకు శిక్షణ ఇచ్చామన్నారు. ఈనెల 30న రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించానున్నామని తెలిపారు. ఎఫ్‌ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలను ఏర్పాటు చేస్తున్నామని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ, ఎన్నికలకు సంబంధించి పోలీస్‌పరంగా అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయడమేగాక, సరిహద్దు చెక్‌పోస్టులను పటిష్ఠం చేస్తామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్‌అమిత్, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఏఎస్పీ మౌనిక, జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, ఆర్డీవోలు వై.అశోక్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి, డీఈవో భిక్షపతి, ఆర్డీవో పాల్గొన్నారు.

అమలులోకి ఎన్నికల ప్రవర్తనా నియమావళి : కలెక్టర్

రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినందున తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వపరంగా ప్రజాప్రతినిధులతో కలిసి ఎలాంటి అధికారిక కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా రాజకీయ పార్టీలకు సంబంధించిన, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన హోర్డింగులు, కటౌట్లు, పోస్టర్లు, బ్యానర్లు ఉండకూడదన్నారు. అదేవిధంగా ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు తెలిపారు. నవంబరు 11 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకొని మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండక్రైం,సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజలకు పోలీస్‌శాఖను మరింత చేరువచేయడమే లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో వివిధ ప్రాంతాల నుంచి 25 మంది అర్జీదారుల ఫిర్యాదులు తీసుకొని వారితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి బాధితులకు సత్వర న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, బాధితుల సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు తీసుకోవాలన్నారు. సంబంధిత ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి న్యాయం చేయాలన్నారు.

పౌరసరఫరాల సంస్థ డీఎం బాధ్యతల స్వీకరణపై డైలమా

ఎన్నికల కోడ్‌తో సందిగ్ధం

నల్లగొండ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా పౌరసరఫరాలశాఖ కొత్త డీఎం బాధ్యతల స్వీకరణ డైలమాలో పడింది. ఇక్కడ డీఎంగా పనిచేసిన హరీష్‌ను బదిలీ చేసి ఆయన స్థానంలో రంగారెడ్డి జిల్లాకు చెందిన గోపిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే బాధ్యతల స్వీకరణకు ఎన్నికల కోడ్ అడ్డం రావడంతో నిలిపివేసినట్టు సమాచారం. అదేవిధంగా ప్రస్తుతం డీఎంగా ఉన్న హరీష్ రిలీవ్‌ను కూడా నిలిపివేసినట్లు తెలిసింది. డీఎంగా బాధ్యతలు తీసుకునేందుకు రంగారెడ్డి జిల్లా నుంచి గోపి సోమవారం రాగా, ఎన్నికల షెడ్యూల్ రావడంతో ఆయనకు ఉన్నతాధికారులు బాధ్యతలు అప్పగించలేదని వినికిడి.

అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయండి

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి



కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్న పాఠశాలల నుంచి అవసరం ఉన్న పాఠశాలకు అదే కాంప్లెక్స్ లేదా అదే మండలంలో సర్దుబాటు చేయాల్సి ఉండగా, ఈ నిబంధనలను అధికారులు విస్మరించారన్నారు. అక్రమాలకు తావులేకుండా, నిబంధనలను పాటించి సర్దుబాటు చేయాలని విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే డీఈవోను కలిసి విన్నవించామన్నారు. కానీ జిల్లాలో ఎలాంటి ఉత్తర్వులు లేకుండా మౌఖిక ఆదేశాలతో కొంతమంది ఉపాధ్యాయులను, ఉత్తర్వులు ఇచ్చి మరి కొంతమంది ఉపాధ్యాయులను అక్రమంగా డిప్యూటేషన్‌లో కొనసాగిస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో ఇష్టారాజ్యంగా కొనసాగుతున్న అక్రమ డిప్యూటేషన్ల వ్యవహారంపై కలెక్టర్ వెంటనే స్పందించి రద్దుచేయాలని డిమాండ్ చేశారు. సమావేశం అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బక్కా శ్రీనివాసాచారి, నాగమణి, పెరుమాళ్ల వెంకటేశం, నర్రా శేఖర్‌రెడ్డి, వడిత్య రాజు, ఎడ్ల సైదులు, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, గేర నరసింహ, నలపరాజు వెంకన్న, పగిళ్ల సైదులు, కొమ్రరాజు సైదులు, ఎం.చిన్నవెంకన్న, కోట్ల యాదగిరి, మురళయ్య, టి.నరసింహమూర్తి, మధుసూదన్, పి.నరసింహ, శ్యామ్‌కుమార్, ఆర్.రాకేశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సద్దుల బతుకమ్మ



జిల్లావ్యాప్తంగా సద్దుల బతుకమ్మ వేడుకలు వైభవంగా జరిగాయి. సోమవారం సాయంత్రం గ్రామ, పట్టణ ప్రధాన కూడళ్లతో పాటు చెరువులు, కుంటల సమీపాల్లో బతుకమ్మలను ఏర్పాటు చేసి, గౌరమ్మకు పూజలు చేసి బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు. 8

బీఆర్ఎస్ నేతలు చర్చకు రావాలి

ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్

వచ్చే ఎన్నికల్లో మంత్రి కోమటిరెడ్డి లక్ష ఓట్లతో గెలుస్తారు : గుమ్ముల



బీఆర్ఎస్ అలియాస్ టీఆర్ఎస్ బాకీ, వడ్డీకార్డు విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ శంకర్ నాయక్, గుమ్ముల మోహన్‌రెడ్డి

నల్లగొండ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అధికారం కోల్పోయిన తరువాత బీఆర్ఎస్ నాయకులు సోయి లేకుండా మాట్లాడుతున్నారని జగదీష్ రెడ్డి తిప్పర్తిలో ఆరు గ్యారంటీలపై విడుదల చేసిన కార్డుపై బీఆర్ఎస్ నేతలకు నల్లగొండ గడియారం సెంటర్‌కు చర్చకు రావాలని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేతావత్ శంకర్‌నాయక్ సవాల్ విసిరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డితో కలిసి బీఆర్ఎస్ అలియాస్ టీఆర్ఎస్ బాకీ, వడ్డీ కార్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగదీష్ రెడ్డి ఇదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎర్రగడ్డలో, జగదీష్‌రెడ్డిని నల్లగొండ గొల్లగూడ ఆస్పత్రిలో చేర్పిస్తామన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ ఎటువంటి అభివృద్ధి పనులు చేయకుండా ప్రాజెక్టుల పేరుతో పేద ప్రజల సొమ్మును దోచుకుందని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయిన తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. ఎస్సీలకు మూడు ఎకరాలు పంపిణీ చేస్తామని చెప్పి బాకీ పడ్డారని, రైతులకు రుణమాఫీకి సంబంధించి వడ్డీ బాకీ గత ప్రభుత్వంపై ఉందన్నారు. నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు బాకీ పడిందని, ప్రజలకు డబుల్‌బెడ్‌రూం బాకీ ఉందన్నారు. వీటన్నంటినీ విస్మరించి ప్రజలను మోసం చేశారన్నారు. ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పటిష్టంగా ఉందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదన్నారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి మాట్లాడుతూ, గత ఎన్నికల్లో 50వేలకు పైగా మెజార్టీతో గెలిచిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. పట్టణంతోపాటు నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, నాయకులు పాశం సంపత్‌రెడ్డి, గడ్డం అనూప్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, షబ్బీర్‌బాబా, కార్తీక్, నాగరాజు, నవీన్ గౌడ్, యాదగిరి, అంజి, చిట్టి, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల కమీషన్ ఇవ్వాలి

డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రేషన్‌డీలర్లు

నల్లగొండ (కలెక్టరేట్), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లకు రావాల్సిన కమీషన్‌ను వెంటనే విడుదల చేయాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పారెపల్లి నాగరాజు, ప్రధాన కార్యదర్శి వైద్యుల సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఏప్రిల్ మాసం నుంచి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి కమీషన్ రాక డీలర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. డీలర్ల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కమీషన్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తూకాల్లో తేడాలు ఉంటున్నాయని, గోదాముల నుంచి దుకాణాలకు చేరే సరికి 50కిలోల బస్తాలో రెండు నుంచి మూడు కిలోల తరుగు ఉంటుందన్నారు. దీంతో తనిఖీ అధికారులు వచ్చినప్పుడు స్టాకుల్లో తేడాలు వస్తున్నాయని, ఫలితంగా అధికారులు కేసులు నమోదు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద వేబ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డీలర్లకు గౌరవ వేతనం, కమీషన్‌ను రూ.300కు పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.సత్యనారాయణ, బొల్ల వేణుగోపాల్‌రావు, సముద్రాల యాదగిరి, మచ్చ నాగరాజు, హఫీజ్, సలీం, మునీందర్‌రావు, విజయ్‌కుమార్, కలీం, సరిత, బాల్‌రెడ్డి, అంతటి శ్రీనివాస్, నర్సింహ, పాల్గొన్నారు.

సరస్వతీ నమస్తుభ్యం



దేవీనవరాత్రోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా చిన్నారులు విద్యాబుద్ధులు ప్రసాదించాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 6

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

సీపీఎం నేత జూలకంటి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం దొడ్డికొమరయ్య భవనంలో నిర్వహించిన పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరంతరం ప్రజల కోసం పోరాటాలు చేసే సీపీఎం శ్రేణులను ప్రజలు అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ ప్రక్రియ సక్రమంగా జరగలేదని, పలు స్థానాల్లో అవకతవకలు జరిగాయని, వాటిని వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజాపాలన పేరుతో కాలయాపన చేస్తున్నారని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం, మంత్రివర్గం పట్టించుకోవడం లేదన్నారు. వానాకాలం సీజన్ వరి కోతలు ప్రారంభంకానున్నాయని, వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పత్తిపై కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం ఎత్తివేయడంతో ధర తగినంత రాదని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే సీసీఐ కేంద్రాలను తెరవాలన్నారు. త్రిబుల్‌ఆర్ పాత అలైన్‌మెంట్ ప్రకారం భూసేకరణ చేయాలని, నిర్వాసితులకు బహిరంగ మార్కెట్ ధర చెల్లించాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, నాయకులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నారి అయిలయ్య, బండా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, కందాల ప్రమీల, సయ్యద్ హాషం, పాలడుగు ప్రభావతి, చినపాక లక్ష్మీనారాయణ, వీరెపల్లి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ నమస్తుభ్యం..

దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారిని సోమవారం సరస్వతీ దేవిగా అలంకరించారు. దుర్గాదేవి మండపాల్లో, అమ్మవారి ఆలయాల్లో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, అలంకరణలు, కుంకుమ పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. మండలపాల వద్ద విద్యార్థులతో అక్షరాభ్యాసాలు చేయించారు. దీంతో ఆలయాలు, మండపాల వద్ద చిన్నారుల సందడి నెలకొంది.



దేవరకొండ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న విద్యార్థులు చిన్నారులు, తల్లిదండ్రులు



దర్వేశిపురం రేణుకాఎల్లమ్మ దేవి ఆలయంలో సరస్వతీదేవి అలంకారం



మోత్కూరు అంగడిబజారు మండపంలో చిన్నారులకు నోటుపుస్తకాలు, పెన్సిళ్లు అందజేత



వలిగొండలోని త్రిశక్తి ఆలయంలో సరస్వతీదేవిగా అమ్మవారు

కుమారుడిపై మనస్తాపంతో ఆత్మహత్య

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కుమారుడు జీవితంలో స్థిరపడకపోవడంతో మనస్తాపానికి గురైన ఓ తండ్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం చౌటుప్పల్ పట్టణంలోని రాంనగర్‌కు చెందిన బొల్లు రామచంద్రం(65) స్థానికంగా ఉన్న పాతభాస్కర్ థియేటర్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. అతడి భార్య ఏడాది కిందట అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. చిన్నకుమారుడు జీవితంతో స్థిరపడకపోవడంతో మరింత క్షోభకు గురయ్యాడు. దీంతో మనస్తాపానికి గురైన రామచంద్రం సోమవారం మధ్యాహ్నం థియేటర్‌లో క్రిమిసంహారక మందు తాగగా, మధ్యాహ్నం భోజనానికి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు థియేటర్‌కు వద్దకు వెళ్లారు. అప్పటికే అపస్మారకస్థితిలో ఉన్న రామచంద్రంను హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రామచంద్రం పెద్ద కుమారుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బస్వాపూర్ ఫీడర్‌ఛానల్ గుంతలో పడి వ్యక్తి మృతి

భువనగిరి రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం సహా ఓ వ్యక్తి గుంతలో పడి మృతి చెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి శివారులోని రాయిగిరి వద్ద జరిగింది. భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరి పట్టణంలోని పెద్దవాడకు చెందిన కడారి రమేష్(53) ఆదివారం రాయిగిరిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఓ శుభకార్యానికి హాజరయ్యారు. అతడి వెంట కుమారుడు మహేష్ వెళ్లాడు. అయితే తండ్రి రమేష్ కోసం వెతకగా శుభకార్యం వద్ద కనిపించకపోవడంతో వెంటనే కుమారుడు ఫోన్‌చేశాడు. తాను మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్‌లో ఉన్నానని తండ్రి సమాధానమిచ్చాడు. మరికొద్ది సేపటికి ఫోన్ చేయగా ఫోన్ స్విచ్‌ఆఫ్ అయిందని భయాందోళనకు గురయ్యాడు. అయితే సోమవారం ఉదయం మహేష్‌కు తెలిసిన ఓ వ్యక్తి ఫోన్ చేసి హైదరాబాద్-వరంగల్ జాతీయరహదారి రాయిగిరిలో శివారులో బస్వాపూర్ ఫీడర్ ఛానల్ కోసం కాల్వ నిర్మాణానికి తవ్విన గుంతలో రమేష్ మృతదేహం ఉన్నట్లు చెప్పాడు. వెంటనే కుమారుడు ఘటనా స్థలానికి చేరుకుని తండ్రి మృతదేహం నీటి గుంతలో పడి ఉన్నట్లు గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారమిచ్చాడు. మృతదేహాన్ని, ద్విచక్రవాహనాన్ని ఎక్స్‌కవేటర్ సాయంతో వెలికితీశారు. మహేష్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ తెలిపారు.

స్కూల్ బస్సు దగ్ధం : రూ.7 లక్షలు నష్టం

మఠంపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల ఆవరణలో ఉన్న స్కూల్ బస్సు పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలకేంద్రంలో జరిగింది. పాఠశాల యాజమాన్యం, ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని ఆర్బిట్ పాఠశాలకు ఈ నెల 20న నుంచి దసరా సెలవు ఇచ్చారు. దీంతో పాఠశాల బస్సులను యాజమాన్యం ఆవరణలోని మైదానంలో పక్కకు నిలిపింది. సోమవారం తెల్లవారుజామున బస్సు నుంచి పొగతో కూడిన మంటలు రావడంతో స్థానికులు యాజమాన్యానికి తెలిపారు. వారు వచ్చేలోపు బస్సు దగ్ధమైంది. ఈ ఘటనలో రూ.7 లక్షల నష్టం జరిగినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ ప్రమాదానికి కారణాలు పూర్తిగా తెలియరాలేదు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ బాబు తెలిపారు.

తూకాల్లో తేడాతో వేబ్రిడ్జి సీజ్

మోత్కూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం అనాజీపురంలో తప్పుడు తూకం చూపుతున్న వేబ్రిడ్జిని లీగల్ మెట్రాలజీ జిల్లా అధికారి కందగట్ల వెంకటేశ్వర్లు సోమవారం తనిఖీ చేశారు. ఈ నెల 25న వేబ్రిడ్జిలో తప్పుడు తూకంతో మోసం చేస్తున్నారని రైతులు ఆందోళన చేశారు. దీంతో లీగల్ మెట్రాలజీ జిల్లా అధికారి అందుబాటులో లేకపోవడంలో తహసీల్దార్ వేబ్రిడ్జిని పరిశీలించి, ఆయన వచ్చి తనిఖీ చేసే వరకు వేబ్రిడ్జి వాడవద్దని ఆదేశించారు. ఈ నేపథ్యంలో సోమవారం లీగల్ మెట్రాలజీ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు వచ్చి వేబ్రిడ్జిని తనిఖీ చేశారు. 30 కిలోలు తక్కువ తూకం చూపడంతో వేబ్రిడ్జిని సీజ్ చేసి, నిర్వాహకుడికి జరిమానా విధించారు. అనంతరం మోత్కూరులో పలు వస్త్రదుకాణాలను తనిఖీచేశారు. తూకాల్లో, కొలతల్లో తేడా ఉంటే వ్యాపారులపై కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

మార్ఫింగ్ ఫొటోలతో భర్త బంధువులకు వేధింపులు

భువనగిరి టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఓ జంట మధ్య తలెత్తిన విభేదాలతో భర్త బంధువులను మార్ఫింగ్ ఫొటోలతో వేధిస్తున్న భార్య ఉదంతం యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరిలో వెలుగుచూసింది. భువనగిరి పట్టణానికి చెందిన యువకుడికి జనగామ యువతితో మూడేళ్ల క్రితం వివాహమైంది. అయితే వీరి మధ్య తలెత్తిన విభేదాలతో ఆమె అత్తింటి బంధువుల పలువురి ఫొటోలను అసభ్యంగా మార్ఫింగ్ చేసి సోషల్‌మీడియాలో పెడుతోంది. భర్త చేసిన హెచ్చరికలను సైతం ఆమె బేఖాతరు చేయడంతో ఇటీవల ఆయన భువనగిరి పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. దీంతో ప్రత్యేక బృందం సోమవారం జనగామలో కాపు కాసి అదుపులోకి తీసుకుని భువనగిరి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆమె హంగామా సృష్టించింది. అయినప్పటికీ పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.

యువతి అదృశ్యం



ఆదిత్యకుమారి

చిట్యాల రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వేంబావిలో యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మామిడి రవికుమార్ తెలిపారు. వేంబావి గ్రామానికి చెందిన పంగరెక్క కృష్ణయ్య కుమార్తె ఆదిత్యకుమారి నల్లగొండలోని ఆల్ఫా నర్సింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటోంది. ఇటీవల కళాశాలకు దసరా పండుగ సెలవులు రావడంతో ఈ నెల 26న ఇంటికి వచ్చింది. రెండు రోజుల తరువాత 28వ తేదీ ఉదయం 8గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో గ్రామంలో, బంధువులు నివాసాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. తండ్రి కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ విషయంలో తమకు చండూరు మండలం బొడంగపర్తికి చెందిన ఓ వ్యక్తిపై అనుమానం ఉందని, తన కుమార్తె ఆచూకీ కనుగొని అప్పగించాలని పంగరెక్క కృష్ణయ్య పోలీసులను కోరారు.

భద్రాచలంలో 10.2 కిలోల గంజాయి పట్టివేత

భద్రాచలం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రికొత్తగూడెం జిల్లా భద్రాచలంలో సోమవారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు 10.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఆర్టీవో చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరు వ్యక్తులను తనిఖీ చేయగా గంజాయి లభించడంతో అరెస్టుచేశారు. అనంతరం వీరిని ఎస్ఐ సీహెచ్ శ్రీహరిరావు స్థానిక ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు. పట్టుబడిన వారిలో సూర్యాపేటకు చెందిన గోళ్ల గణేష్, ఒడిశాకు చెందిన మూరగుండ్ల ఆనంద్ ఉన్నారు. తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్ బాలు, కానిస్టేబుల్ సుధీర్, వెంకట్, హన్మంతరావు, విజయ్, ఉపేందర్ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ



కనగల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జరిగిన 17వ జాతీయ హ్యాండ్‌బాల్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచింది. జట్టుకు ప్రాతినిధ్యం వహించిన నల్లగొండ జిల్లా కనగల్ మండలం జీ.ఎడవల్లి ఉన్నత పాఠశాల ఆరవ తరగతి విద్యార్థిని పర్సనబోయిన సౌమ్య ప్రతిభ కనబర్చింది. ఎంఈవో పద్మ, జీఎడవల్లి పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి విద్యార్థినిని అభినందించారు. మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

ప్రైవేట్ ఆసుపత్రుల ఇష్టారాజ్యం

- సీజ్ చేసినా మరోపేరుతో నిర్వహణ
- వద్దని హెచ్చరించినా సూపర్ స్పెషాలిటీ బోర్డులు
- ప్రైవేట్ ఆసుపత్రులపై కొరవడిన పర్యవేక్షణ

జిల్లా కేంద్రంలో ఓ ఆసుపత్రిని అధికారులు మూసివేసినట్లు చెబుతున్నా, వేరే చోట అదే సిబ్బంది మరో పేరుతో ఆసుపత్రిని నిర్వహిస్తున్నారు. ఇటీవల ఓ ఆసుపత్రికి సూపర్ స్పెషాలిటీ పెట్టుకోవద్దని హెచ్చరిస్తున్నా, ఆ యజమాన్యం లెక్క చేయకుండా బోర్డు పెట్టుకుని ఆసుపత్రిని నిర్వహిస్తోంది. నిబంధనలను ప్రైవేట్ ఆసుపత్రులు పాటించడం లేదు. అంతేకాకుండా ప్రైవేట్ ఆసుపత్రులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి-భానుపురి)



ప్రైవేట్ ఆసుపత్రులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కడంతో పాటు అర్హతకు మించి ఆపరేషన్లు, పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇటీవల సూర్యాపేటలో ఓ ఆసుపత్రిని మూసివేసినట్లు వైద్యశాఖ అధికారులు చెబుతున్నా అదే సిబ్బంది మరో పేరుతో ఆసుపత్రిని నడిపిస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. తనిఖీ చేయాల్సిన అధికారులు ముడుపులు తీసుకుంటూ డాక్యుమెంట్లను సరిగా చూడటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతులకు పార్కింగ్ స్థలాలు సైతం లేకపోవడంతో రోడ్డుపైనే వాహనాలు నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ప్రైవేట్ ఆసుపత్రులు ఎదుట ఏర్పాటుచేసిన బోర్డులపై కనీసం వైద్యుల పేర్లు ఉండడం లేదు.

ఆర్ఎంపీల దన్ను

ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వహణకు గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్ఎంపీలు అండగా నిలుస్తున్నారు. రోగులను పంపించి కమీషన్లు పొందుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సౌకర్యాలు, అర్హత లేని ఆసుపత్రులు కూడా సూపర్ స్పెషాలిటీ బోర్డును తగిలించుకుని దండుకుంటున్నా వైద్యఆరోగ్యశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. గత అధికారి పాలనలో ఇష్టానుసారంగా అనుమతులు ఇచ్చినా సరిచేసే పరిస్థితి లేకుండాపోయిందని వాపోతున్నారు. కేవలం తమకు అనుకూలంగా ఉన్న వారి ద్వారా అధికారులకు మామూళ్లు అందిస్తున్నట్లు తెలుస్తోంది.

ధరల పట్టికలేవీ?

ఇష్టానుసారంగా ఆసుపత్రులు ఫీజుల రూపంలో వసూలు చేస్తున్నా అడిగే నాథుడే లేడు. ఏ పరీక్షకు ఎంత ఫీజు తీసుకోవాలని బోర్డును ఏర్పాటుచేయాల్సి ఉన్నా పట్టింపులేదు. ఆరోగ్యశ్రీ నిధులతో చికిత్స పొందినా రోగుల నుంచి డబ్బులను ఆసుపత్రులు దండుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సూర్యాపేటలోని ఓ ఆసుపత్రి ఉచితంగా సేవలు అందిస్తామని చెబుతూనే అక్కడికి వెళ్లిన తర్వాత డబ్బులు వసూలు చేస్తున్నారని, ఆరోగ్యశ్రీకార్డు ద్వారా డబ్బులను తీసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి.

అనుభవం లేని వైద్యులను పెట్టుకుని రోగులకు అవసరం లేని ఔషధాలను రాస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ పేరుతో అవసరం లేని పరీక్షలు చేసి జేబులకు చిల్లులు పెడుతున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. ప్రైవేట్ ఆసుపత్రులను నడిపించే ప్రభుత్వ డాక్టర్లు ప్రభుత్వ ఆసుపత్రిలో రెండు గంటలే పనిచేసి సొంత ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. తనిఖీలు చేసే అధికారులకు సైతం సొంత ఆసుపత్రులు ఉండడంతో ఆడపాదడపా తనిఖీలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధ్వానంగా వ్యర్థాల నిర్వహణ

ఆసుపత్రుల్లోని నీటిని నిబంధనల మేరకు బయటికి నేరుగా పంపించకుండా ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటుచేసి శుద్ధి చేసుకోవాల్సి ఉంది. బ్యాక్టీరియాను తొలగించి నీటిని బయటికి వదలాల్సి ఉంది. అయితే 10 ఆసుపత్రులకు తప్ప మిగతా ఆసుపత్రులో ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లు లేవు. ఈ ప్లాంట్ ఏర్పాటుకు సుమారు రూ.3 లక్షల ఖర్చవుతోందని ఏర్పాటు చేయకుండా నేరుగా మురుగు కాల్వల్లోకి కలుషిత నీటిని వదులుతున్నారని పట్టణవాసులు చెబుతున్నారు. అయినప్పటికీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నుంచి సర్టిఫికేట్లను కొందరు పొందుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. చివరకు ఫైర్‌సేఫ్టీ యంత్రాలు కూడా లేకపోవడంతో అందుకు తగ్గట్టుగా భవనాలు లేకున్నా ఆసుపత్రుల నిర్వహణ యథేచ్ఛగా కొనసాగుతోంది.

నిబంధనలు పాటించని ఆసుపత్రులను సీజ్ చేస్తాం

నియమ, నిబంధనలు పాటించని ఆసుపత్రులను నోటీసులు జారీ చేస్తాం. నోటీసులకు సరైనా సమాధానం రాకపోతే సీజ్ చేస్తాం. ఇటీవల కాలంలో తనిఖీలు ముమ్మరం చేశాం.

చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో, సూర్యాపేట

పాతకక్షల నేపథ్యంలో హత్య



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కొత్తపల్లి నర్సింహ

సూర్యాపేట క్రైం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పాతకక్షల నేపథ్యంలో హత్యకు పాల్పడిన నిందితులను సూర్యాపేట రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కొత్తపల్లి నర్సింహ వెల్లడించారు. సూర్యాపేటలోని ఇందిరమ్మకాలనీకి చెందిన చారగండ్ల శివకుమార్‌కు పట్టణంలోని అన్నాదురైనగర్‌కు చెందిన పెద్ది లింగస్వామితో ఏడేళ్ల కిందట గొడవ జరిగింది. ఆ ఘటనపై లింగస్వామిపై శివకుమార్ ఫిర్యాదుతో కేసు నమోదైంది. ఈ నెల 26న లింగస్వామి, శివకుమార్‌ల మధ్య సూర్యాపేటలోని పూలసెంటర్‌లో గొడవ జరిగింది. దీంతో శివకుమార్‌ను హత్య చేయాలని లింగస్వామి భావించాడు. అందుకోసం మిత్రులైన సూర్యాపేటలోని ఎన్టీఆర్‌కాలనీకి చెందిన రౌడీషీటర్ మాతంగి మధును సంప్రదించాడు. ఇద్దరూ కలిసి వారి మిత్రులైన మరికొందరితో కలిసి శివకుమార్ హత్యకు ప్రణాళిక రూపొందించారు.

పథకం ప్రకారమే...

శివకుమార్‌కు ఈ నెల 26 సాయంత్రం మధు ఫోన్‌చేసి కుసుమవారిగూడెం వద్ద ఉన్న మద్యం దుకాణం వద్దకు రావాలన్నాడు. శివకుమార్ వెళ్లి అక్కడే ఉన్న విజయ్ హోటల్‌లో రాత్రి 10 గంటల వరకు మద్యం సేవిస్తూ ఉన్నాడు. అదును చూసిన నిందితులు మాతంగి మధు, లింగస్వామితో పాటు వారి మిత్రులైన సూర్యాపేటలోని సీతారాంపురం ప్రాంతానికి చెందిన చెవుల నరేష్, జేజేనగర్‌కు చెందిన జక్కి సతీష్, సూర్యాపేట మండలం కేసారం గ్రామానికి చెందిన రుషింగపుల సతీష్, తాళ్లగడ్డకు చెందిన నేరేళ్ల శ్రీరాములు, అన్నాదురైనగర్‌కు చెందిన గువ్వల తరుణ్‌కుమార్, కేసారం గ్రామానికి చెందిన సూర రామచంద్రు, నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం అయిటిపాముల గ్రామానికి చెందిన చింతపల్లి వెంకటేష్, సూర్యాపేటలోని ఇందిరమ్మకాలనీకి చెందిన జెల్ల ఉదయ్‌కిరణ్, జేజేనగర్‌కు చెందిన విద్యార్థి జక్కి అనిల్, కృష్ణా థియేటర్ సమీపంలోని వర్రె రామకృష్ణలు కలిసి శివకుమార్‌ను కత్తులు, గొడ్డళ్లతో హత్యచేశారు. లింగస్వామి, మాతంగి మధు, చెవుల నరేష్, జక్కి సతీష్, రుషింగపుల సతీష్‌లు శివకుమార్‌పై దాడికి పాల్పడగా అతడి సమాచారాన్ని నేరేళ్ల శ్రీరాములు, గువ్వల తరుణ్‌కుమార్ మధుకు చేరవేశారు. రామచంద్రు, వెంకటేష్‌లు హత్య అనంతరం నిందితులు తప్పించుకోవడానికి సహకరించారు. హత్య గురించి తెలిసినా చెప్పకుండా జెల్ల ఉదయ్‌కిరణ్ ఆ సమయానికి సంఘటనా స్థలం నుంచి వెళ్లిపోయాడు. అదేవిధంగా జక్కి అనిల్, వర్రె రామకృష్ణ కూడా నిందితులు పారిపోవడానికి సహకరించడంతో పాటు హత్యకు ఉపయోగించిన ఆయుధాలు సరఫరా చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు కేసారం గ్రామంలో సతీష్ ఇంటి దగ్గర మధు, లింగస్వామి, నరేష్, జక్కి సతీష్, రుషిగంపుల సతీష్‌లను అదుపులోకి తీసుకుని విచారించి, మిగిలిన నిందితులను నేరేళ్ల శ్రీరాములు, తరుణ్‌కుమార్, రామచంద్రులను అన్నాదురైనగర్‌లోని లింగస్వామి ఇంటి వద్ద అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అయిటిపాముల గ్రామంలో వెంకటేష్, రెండో విడత ఇందిరమ్మ కాలనీలోని నివాసంలో ఉదయ్‌కిరణ్‌లను అదుపులోకి తీసుకుని హత్యకు ఉపయోగించిన ఆయుధాలు, సెల్‌ఫోన్లు, వాహనాలను స్వాధీనం చేసుకుని కోర్టుకు రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. మరో ఇద్దరు రామకృష్ణ, అనిల్ పరారీలో ఉన్నారని వారిని కూడా త్వరలో పట్టుకుని రిమాండ్‌కు పంపిస్తామన్నారు.

నిందితులపై పీడీయాక్ట్

నిందితుల్లో మాతంగి మధుపై సూర్యాపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్‌తో పాటు 9 వివిధరకాల కేసులు, లింగస్వామిపై రౌడీషీట్‌తో పాటు ఐదు, జక్కి సతీష్‌పై రౌటీషీట్‌తో పాటు మూడు, నరేష్‌పై నాలుగు కేసులు, రుషిగంపుల సతీష్‌పై ఒక కేసు, నేరేళ్ల శ్రీరాములుపై నాలుగు కేసులతో పాటు గంజాయి సస్పెక్ట్ షీట్, వెంకటేష్, ఉదయ్‌కిరణ్‌లపై రెండేసి కేసులు ఉన్నాయన్నారు. వీరిపై పీడీయాక్టు కేసు నమోదు చేస్తామని ఎస్పీ తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఎస్పీ ప్రసన్నకుమార్, సూర్యాపేటరూరల్ సీఐ గురుకుల రాజశేఖర్, ఎస్ఐ బాలునాయక్ సిబ్బంది ఉన్నారు.

చెరువుల మరమ్మతులకు రూ.6.60 కోట్లు



మిర్యాలగూడలో చెరువు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, సెప్టెంబరు 29 (ఆంధ్రజోతి) : చెరువుల మరమ్మతు పనులకు రూ.6.60కోట్ల నిధులను వెచ్చిస్తున్నట్లు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని చెరువు మరమ్మతు పనులను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. పందిర్లపల్లి పెద్దచెరువు, చిన్నచెరువుల కట్టలు, తూముల మరమ్మతు పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. రైతుల సాగునీటి అవసరాలు తీర్చేలా మరమ్మతులు చేపట్టి త్వరగా పూర్తిచేయాలని అన్నారు. 15వ ఫైనాన్స్ జనరల్ ఫండ్ కింద రూ.6.80 కోట్లతో పట్టణంలోని పలు కాలనీలలో నూతన మురుగుకాల్వల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. అమృత్.2 స్కీం కింద రూ.93 కోట్లతో 20 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన పంప్‌హౌస్, వాటర్‌ట్యాంకుల నిర్మాణం చేపట్టి 6,800 నూతన ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఇస్తున్నామన్నారు. రూ.20 కోట్లతో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, రూ.171 కోట్లతో136 కిలోమీటర్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణం టీఎఫ్ఐడీసీ నిధులు రూ.93 కోట్లతో సీసీ రోడ్లు, రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నట్లు వివరించారు. పట్టణ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇల్లు నిర్మించి ఇవ్వడం అభినందనీయం

మిర్యాలగూడ రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద వృద్ధ దంపతులకు ఇల్లు నిర్మించి ఇవ్వడం అభినందనీయమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని సామ్యాగానితండాలో నిరుపేద వృద్ధదంపతులు కేతావత్ రాములు, కమిలిలకు అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ధీరావత్ చందునాయక్ సొంత ఖర్చులతో ఇల్లు నిర్మించారు. సోమవారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి గ్రామానికి వచ్చి గృహప్రవేశం చేసి మాట్లాడారు. ఇల్లు కొన్నినెలల క్రితం అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోవడంతో దంపతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న చందునాయక్ వృద్ధ దంపతులకు ఇల్లు నిర్మించి తన దాతృత్వాన్ని చాటుకున్నారని ఎమ్మెల్యే అభినందించారు. కాంగ్రెస్ కార్యకర్తలు చందునాయక్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుల మృతి బాధాకరం : ఎమ్మెల్యే

దేవరకొండ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం నసర్లపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవరకొండ మండలం మటికతండా, జర్పులతండాకు చెందిన ముగ్గురు యువకులు మృతి చెందడం బాధాకరమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతులు భాస్కర్, వినోద్, రవిలు పండుగకు వచ్చి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారన్నారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని పేర్కొన్నారు. వారి మృతికి సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నట్లు ఎమ్మెల్యే బాలునాయక్ ప్రకటనలో పేర్కొన్నారు.

పొనుగోడులో బతుకమ్మ విగ్రహం



చెరువుకట్టపై ఏర్పాటుచేసిన బతుకమ్మ విగ్రహం

గరిడేపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం పొనుగోడులో చెరువు కట్టపై బతుకమ్మలతో కూడిన తల్లీకుమార్తెల విగ్రహాలను ఏర్పాటు చేశారు. జోగు పిచ్చిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోశాధికారి జోగు అరవిందరెడ్డి ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. చెర్వుకట్టను సుందరంగా తీర్చిదిద్దారు. మహిళలు బతుకమ్మలను నీటిలో వదిలేందుకు మెట్లు ఏర్పాటు చేసి పర్యాటక ప్రదేశంగా, ప్రజలు సాయంత్రం అక్కడ కూర్చుని చెరువు అందాలను తిలకించేందుకు కుర్చీలను, బెంచీలను కట్టపై ఏర్పాటుచేశారు. పిల్లలు ఆడుకునేందుకు త్వరలో చిల్డ్రన్ పార్క్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు అరవిందరెడ్డి తెలిపారు.

నెమ్మదించిన మూసీ

● ప్రాజెక్టుకు తగ్గుముఖం పట్టిన వరద ఉధృతి



కేతేపల్లి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టుకు వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో రోజుల తరబడి విస్తారంగా కురుస్తున్న వర్షాలకు నిండిన హైదరాబాద్‌లోని ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌ల గేట్లు ఎత్తడంతో రెండు రోజులుగా ఉగ్రరూపం దాల్చిన మూసీ ఆదివారం రాత్రి నుంచి క్రమంగా శాంతిస్తూ వచ్చింది. ఆదివారం సాయంత్రానికి 20936.38క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో సోమవారం సాయంత్రానికి సగానికిపైగా తగ్గి 9152.18 క్యూసెక్కులుగా నమోదైంది. దీంతో శని, ఆదివారాల్లో దాదాపు 8అడుగుల మేర ఎత్తి వరద నీటిని విడుదల చేసిన 8క్రస్టుగేట్లలో నాలుగింటిని పూర్తిగా మూసి వేసిన అధికారులు ఎగువ నుంచి వచ్చే ఇన్‌ఫ్లోతో 641.60అడుగు(3.59టీఎంసీలు)లకు పడిపోయిన ప్రాజెక్టు నీటిమట్టాన్ని 645అడుగుల గరిష్ఠ స్థాయికి పెంచుతూ మిగిలిన నీటిని ప్రాజెక్టు 2, 3, 8, 10వ క్రస్టుగేట్లను మూడు అడుగుల మేర ఎత్తి 7742.08 క్యూసెక్కులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అధికారులు మిగిలిన వరద ఈ క్రమంలో సోమవారం సాయంత్రానికి ప్రాజెక్టు నీటిమట్టం 643.47అడుగులు(4.06టీఎంసీ)లకు చేరింది. రెండు రోజులుగా సూర్యాపేట-మిర్యాలగూడెం రూట్‌లో నిలిచిన బస్సు సర్వీసులను సోమవారం పునరుద్ధరించారు. భీమారం సూర్యాపేటల మధ్య గల లోలెవల్ కాజ్‌వే మీదుగా వచ్చే మూసీ వరద తగ్గుముఖం పట్టడంతో బస్సు సర్వీసులను నడిపారు.

మట్టపల్లి ఆలయ ప్రాంగణంలోకి వరద

మఠంపల్లి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వస్తున్న భారీ వరదతో పాటు వర్షాలతో పులిచింతల ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం చేరడంతో మట్టపల్లి ఆలయం వద్ద కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తోంది. ఇప్పటికే పులిచింతల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 45.17 టీఎంసీలతో నిండు కుండలా ఉంది. వరద పెరుగుతుండటంతో ఆలయం ముంపు అంచులో ఉంది. సాధారణంగా ప్రాజెక్టులో సుమారు 32టీఎంసీల నీరు నిల్వ ఉంటే పుష్కరాల ఘాట్లు, ఆలయమెట్లు మునిగిపోతాయి. అదే 36 టీఎంసీలు ఉన్న నీటినిల్వతో మట్టపల్లి ఆలయంలో కరకట్ట లీకేజీ ద్వారా ఆలయంలో వరదనీరు చేరుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో సుమారు 41టీఎంసీ నీటి నిల్వ ఉండటంతో దేవాలయం వద్ద కరకట్టకు సుమారు ఆరు అడుగుల అంచులో నీరుచేరి లీకేజీ అవుతోంది. ఆలయ ప్రాగణంలో అడుగు వరకు వరదనీరు చేరుతుండటంతో రెండు హైస్పీడ్ మోటర్ల ద్వారా బయటకు పంపిస్తున్నారు.



మట్టపల్లి ఆలయం వద్ద కృష్ణానదీ ప్రవాహం

మార్కెట్‌కు దసరా కళ



నల్లగొండలోని ఓ వస్త్ర దుకాణంలో సందడి

▸ ఆఫర్లతో ఆకర్షిస్తున్న దుకాణదారులు
▸ పోటాపోటీగా డిస్కౌంట్లు ప్రకటిస్తున్న వ్యాపారులు

నల్లగొండ కల్చరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ రావడంతో మార్కెట్ కళకళలాడుతోంది. ఎక్కడ చూసినా వినియోగదారులతో దుకాణాలు సందడిగా మారాయి. డిస్కౌంట్ ఆఫర్లతో ఆకట్టుకుంటున్నారు. వస్త్ర దుకాణాలు, లేడీస్ ఎంపోరియం, కిరాణ దుకాణాలు, టపాకాయల షాపులు బిజీగా మారాయి. మహిళలను ఆకర్షించే విధంగా వ్యాపారులు పోటాపోటీగా డిస్కౌంట్‌లు ఇస్తున్నారు. మహిళల, యువతీ, యువకుల అభిరుచులకు అనుగుణంగా వస్త్రవ్యాపారులు నూతన డిజైన్ల రెడీమెడ్ దుస్తులు విక్రయిస్తున్నారు. వివిధ డిజైన్ల చీరలు, పంజాబీ డ్రెస్‌లు వివిధ రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకున్నారు. యువకులు, పిల్లల కోసం ఆకర్షణీయమైన దుస్తులు అందుబాటులో ఉంచారు. దసరా పండుగ, దీపావళి పండుగ సీజన్ కావడంతో ప్రతిరోజూ లక్షల రూపాయల వ్యాపారం కొనసాగుతోంది. ఏడు రోజుల నుంచి బతుకమ్మ ఉత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు. మూడు రోజుల్లో పండుగ జరగనున్న దృష్ట్యా కుటుంబ సమేతంగా కొత్త వస్త్రాలు కొనుగోలు చేస్తున్నారు. వస్త్ర దుకాణాలతోపాటు ఎం పోరియం నిర్వాహకులు సరికొత్త హంగులతో మహిళలను ఆకర్షించే విధంగా గాజులు, కాస్మోటిక్స్ రోల్డ్ గోల్డ్ వస్తువులు అందుబాటులో ఉంచారు.

రద్దీగా కిరాణా దుకాణాలు



పండుగలకు పిండి వంటలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. దీంతో కిరాణం దుకాణాలు నిత్యావసర సరుకులతో రద్దీ మారాయి. కిరాణం దుకాణదారులు ప్రతి 5కిలోల కొనుగోళ్లపై డిస్కౌంట్ కూడా ఇస్తున్నారు. అదేవిధంగా కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే వ్యాపారులు లక్ష్మీబాంబులు, చిచ్చుబుడ్లు, తోక పటాకులు, ఉల్లిగడ్డ రాకెట్ బాంబులు విక్రయిస్తున్నారు.

కాస్తంత నిరుత్సాహం...

భువనగిరి టౌన్: దసరా సంబరాల కోసం ఎదురు చూడడం సాధారణమే. అందరూ ఉరిమే ఉత్సాహంతో ఉంటుంటారు. ఈ సారి దసరా మహాత్మాగాంధీ జయంతి అక్టోబరు 2న వస్తుండడంతో పలువురు కాస్తంత నిరుత్సాహానికి గురవుతున్నారు. నిబంధనల ప్రకారం గాంధీ జయంతి రోజున మద్యం, మాంసం విక్రయాలు నిషేదం. ఆ రోజంతా ఆ దుకాణాలు తెరుచుకోవు, విక్రయిస్తే చట్టాన్ని ఉల్లంఘించినట్టే. దీంతో దసరా సంబరాలు ఎలా అని పలువురు తమలో తాము ప్రశ్నించుకుంటున్న పరిస్థితి. ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో ఉన్నారు. అందుకు అనుగుణంగా విక్రయదారులు కూడా ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రచారం. గాంధీ జయంతి రోజున మద్యం, మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భువనగిరి మునిసిపల్ కమిషనర్ జి రామలింగం, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విష్ణుమూర్తి హెచ్చరిస్తున్నారు. విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.

దసరా సరదా ఎలా..

● పండుగ రోజే గాంధీ జయంతి



మిర్యాలగూడ టౌన్, మోత్కూరు: దసరా అంటేనే సరదా పండుగ. అదే రోజు గాంధీ జయంతి రోజు(అక్టోబరు 2)నే దసరా పండుగొచ్చింది. విజయదశమి రోజున భక్తిశ్రద్ధలతో శమీ పూజలు చేసే భక్తులు వారి వారి ఆచారాలు, ఆహారపు అలవాట్లకు అనుగుణంగా వంటావార్పు చేసుకుంటారు. మాంసాహారం, మద్యం సేవించడం ఆనవాయితీగా వస్తోంది. గాంధీ జయంతి రోజును జాతీయ పండుగగా జరుపుకోవడం తెలిసిందే. నిబంధనలు యథాతథంగానే ఉంటాయంటున్నారు అధికారులు. ప్రతీ ఏడాది మాదిరిగానే అక్టోబరు 2న నిబంధనలు వర్తిస్తాయని మునిసిపల్ అధికారులు అంటున్నారు. మద్యం దుకాణాల మూసివేతపై ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలి

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సేవాభావం కలిగి ఉండాలని మహాత్మాగాంధీ యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ మద్దిలేటి పసుపుల అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1, 2 ఆధ్వర్యంలో మండల పరిధిలోని జలాల్‌పూర్ గ్రామంలో, గజేంద్రనగర్ కాలనీలో సోమవారం నిర్వహించిన ఎన్ఎస్ఎస్ శిబిరంలో మాట్లాడారు. శిబిరంలో నేర్చుకున్న విషయాలను సమాజాభివృద్ధికి ఉపయోగించాలని పిలుపునిచ్చారు. జీవితంలో అమ్మ, గురువు, ప్రకృతి మూడు అంశాలను మరవకూడదని సూచించారు. వలంటీర్లు నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు వి జ్యోతి, సాయివర్దన్, నాయకులు పాలకూర్ల ఆగయ్యగౌడ్, పంచాయతీ సెక్రటరీ నవీన్, గోరంటి వినయ్‌కుమార్‌రెడ్డి, గోరంటి ప్రదీప్‌రెడ్డి, కేసారం సురేందర్‌రెడ్డి, నక్క శ్రీనివాస్‌రెడ్డి, శాపాక రాజు, గుండ్ల మహేష్, మహంకాళి వంశీ తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శిబిరంలో పాల్గొన్న మద్దిలేటి పసుపుల

పర్యాటక రంగానికి ప్రపంచస్థాయి గుర్తింపు

ఆలేరు రూరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పర్యాటక రంగానికి ప్రపంచస్థాయిలో గుర్తింపు తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ఎంపీని ప్రవాస భారతీయుడు యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని బహదూర్‌పేట గ్రామానికి చెందిన కొండం పవన్‌కుమార్‌రెడ్డి కలిశారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయలు కాపాడుతూ, పర్యాటక రంగానికి ప్రపంచస్థాయి గుర్తింపు తేచ్చే విధంగా సీఎం రేవంత్‌కుమార్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు.



ఎంపీ చామలకు వినతిపత్రం అందజేస్తున్న పవన్‌కుమార్‌రెడ్డి

సరస్వతీ దేవిగా పర్వతవర్ధిని అమ్మవారు



సరస్వతి అలంకరణలో అమ్మవారు

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం శివాలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయంలో సోమవారం ఎనిమిదవ రోజు సరస్వతి దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ప్రాతఃకాల పూజ, అర్చనలు, పారాయణాలు, శ్రీదేవి మూలమంత్ర జపం, మధ్యాహ్నం శ్రీదేవి చతుష్షష్టి ఉపచార పూజ, నీరాజన మంత్ర పుష్పాలు, ప్రసాద వినియోగం, సాయంత్రం నవావరణ పూజ, చతుశష్టి ఉపచార పూజ, సహస్రనామార్చనలు, మంత్ర పుష్పాల సమర్పణ అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేశారు. వేడుకల్లో ఆలయ అధికారులు, అర్చకులు, పురోహితులు, భక్తులు పాల్గొన్నారు.

విశేష ఆరాధనలు, సహస్రనామార్చనలు



అమ్మవారికి కుంకుమార్చన నిర్వహిస్తున్న అర్చక బృందం

మూల నక్షత్రం సందర్భంగా మహాలక్ష్మీ అమ్మవారికి కలశస్థాపన పూర్వక విశేష ఆరాధనలు, సహస్రనామార్చనలు అర్చకులు వైభవంగా జరిపారు. ఆలయంలో సోమవారం నుంచి గురువారం వరకు పాంచరాత్రాగమన రీతిలో త్రయాహ్నిక దీక్షపూర్వకంగా అమ్మవారి సన్నిధిలో వేదుకలు పూజారులు నిర్వహించారు. విశ్వక్సేన ఆరాధనతో ప్రారంభమైన విశేష కార్యక్రమాలు గురువారం వరకు రోజు ఉదయం, సాయంత్రం అమ్మవారి సన్నిధిలో విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు కాండూరి వెంకటాచార్యులు వివరించారు.

స్వామిని దర్శించుకున్న పీఠాధిపతి

స్వామిని శ్రీపాదరాజ మఠం పీఠాధిపతి సుజయనిధి తీర్థ ముల్బాగల్ సోమవారం దర్శించుకున్నారు. గర్భాలయంలోని స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆలయ అధికారులు, అర్చకులు స్వామిజీకి పూలమాల వేసి ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామివారి కొండపై సోమవారం శివకేశవులకు విశేష పూజలు కొనసాగాయి. సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. శివాలయంలోని ముఖ మండపంలో స్పటిక మూర్తులను అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. ఆలయన ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 10,14,615 ఆదాయం సమకూరినట్లు ఇన్‌చార్జి ఈవో గుగులోతు రమినాయక్ తెలిపారు.

ఆలయంలో ఆయుధ పూజ



ఆయుధ పూజ నిర్వహిస్తున్న ప్రధాన అర్చకుడు వెంకటాచార్యులు, ఎస్పీఎఫ్ అధికారులు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం ఎస్పీఎఫ్ పోలీసులు ఆయుధ పూజ చేశారు. ప్రధాన అర్చకుడు కాందూరు వెంకటాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించగా ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ జి బాబురావు, దేవస్థాన ఎస్పీఎస్ ఇన్‌స్పెక్టర్ కే.శేషగిరిరావు, ఆలయ ఏఈవోలు గజ్వేల్ రఘు, జూశెట్టి కృష్ణ, ప్రతాప నవీన్ కుమార్ శర్మ, హోంగార్డు, ఎస్పీఎఫ్, ఆలయ సిబ్బంది ఈ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మట్టపల్లిలో లక్ష్మీనరసింహుడి కల్యాణం

మఠంపల్లి : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సూరాపేట జిల్లా మట్టపల్లి శ్రీ లక్ష్మీనరసింహుడి క్షేత్రంలో స్వామివారి నిత్య కల్యాణాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండనవీన్, అర్చకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

న్యాయ సహాయంపై అవగాహన ఉండాలి

● జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వీ.మాధవీలత



చీమలకొండూరులోని వయోవృద్ధుల ఆశ్రమాన్ని పరిశీలిస్తున్న మాధవీలత

భువనగిరి రూరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): వయోవృద్ధులు న్యాయ సహాయం, సలహాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వీ.మాధవీలత అన్నారు. సోమవారం మండలంలోని చీమలకొండూరు జేఎంజే వయోవృద్ధుల ఆశ్రమాన్ని పరిశీలించారు. ఆశ్రమం పొందుతున్న వృద్ధులతో ముఖాముఖి జరిపి, ఆశ్రమంలో కల్పిస్తున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ నిర్వాహకులు నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలను సూచించారు.

రిజర్వేషన్లలో ఎస్సీలకు అన్యాయంపై పునఃపరిశీలించాలి

● కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేసిన ఎస్సీ నాయకులు

నల్లగొండ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తాజాగా ప్రకటించిన గ్రామపంచాయతీ, వార్డు సభ్యులు, ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్ల కేటాయింపుల్లో అడవిదేవులపల్లి మండలంలో ఎస్సీలకు పూర్తిగా అన్యాయం జరిగిందని, దీనిపై కలెక్టర్ పునఃపరిశీలించి ఎస్సీ వర్గాలకు న్యాయబద్ధంగా రావాల్సిన సీట్లను కేటాయించాలని మండల ఎస్సీ నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం నల్లగొండ కలెక్టరేట్‌లో వారు వినతిపత్రం అందజేశారు. మండలంలో 13 గ్రామపంచాయతీలకు గాను మొత్తం 14,674 మంది ఓటర్లున్నారని, ఇందులో ఎస్సీలు 1372 మంది ఓటర్లున్నారని, అయితే తాజా రిజర్వేషన్లలో ఎస్సీలకు ఒక్క సర్పంచ్ పదవీ రిజర్వ్ కాలేదని, అయిదు ఎంపీటీసీ స్థానాల్లోనూ ఒక్క ఎంపీటీసీ స్థానం కూడా దక్కలేదని ఆవేదన తెలిపారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఎస్సీలకు 18శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, తమ మండలంలో ఆమేరకు రిజర్వేషన్ అవకాశం కల్పించాలని, కనీసం 2 సర్పంచ్ స్థానాలు, ఒక ఎంపీటీసీ స్థానం ఎస్సీలకు కేటాయించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. నాయకులు కొమ్ము దాసు, పెరుమాళ్ల శ్రీనివాస్, బొజ్జ అనూక్, బి.సైదయ్య, మండల సైదులు, పి.వెంకటేశ్వర్లు, ఎం.ప్రసాద్, జి.దాసు, పెద్దముత్తయ్య తదితరులు వినతిపత్రం అందజేసినవారిలో ఉన్నారు.

చారిత్రక ప్రదేశాల్లో పారిశుధ్యం పాటించాలి

● కేంద్ర పర్యాటక శాఖ సహాయ సంచాలకుడు కృపాకర్



కృపాకర్‌తో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

భువనగిరి టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): చారిత్రక, పురాణ, సందర్శనీయ ప్రదేశాలలో పరిసరాల పరిశుభ్రత పాటించాలని కేంద్ర పర్యాటక శాఖ సహాయ సంచాలకుడు ఆర్.కృపాకర్ అన్నారు. కేంద్ర పర్యాటక శాఖ, మునిసిపాలిటీ, రాక్ క్లైంబింగ్ స్కూల్ ఆధ్వర్యంలో సోమవారం భువనగిరి ఖిల్లాపై నిర్వహించిన స్వచ్ఛతాహీ సేవలో ఆయన మాట్లాడారు. పర్యాటకులు వెంట తెచ్చుకునే ఆహార పదార్థాలు, ప్లాస్టిక్ ప్యాకింగ్, తదితర వస్తువుల వ్యర్థాలను, ఖాళీ వాటర్, కూల్ డ్రింక్ బాటిల్స్‌ను తప్పనిసరిగా చెత్త బుట్టలలో వేయాలని అన్నారు. నిర్లక్ష్యం చూపితే పర్యాటక ప్రాంతాలు అపరిశుభ్రమవుతాయని అన్నారు. భువనగిరి ఖిల్లాపై పేరుకపోయిన వ్యర్థాలను సేకరించి కిందికి తరలించి మునిసిపల్ శానిటేషన్ విభాగానాకి అందించారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ అధికారి కె.ప్రవీణ్, పర్వతారోహకులు, స్వచ్ఛం ద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, పర్యాటకులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సెస్ వసూలుపై దృష్టి



గ్రంథాలయ సెస్సు వసూలుపై రివ్యూలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కరరావు

భువనగిరి (కలెక్టరేట్), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ సెస్ వసూలుపై అధికారులు దృష్టిసారించాలని అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మా ట్లాడారు. గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీల్లో వసూలు చేసే ఇంటి పన్నుల నుంచి 8శాతం సెస్‌ను గ్రంథాలయ పీడీ ఖాతాల్లో జమ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి ఎం.సుధీర్, పలువురు జిల్లా అధికారులు, మునిసిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

మదర్ డెయిరీని ముంచిన ఘనత బీఆర్ఎస్‌దే

● డీసీసీబీ మాజీ చైర్మన్‌వి పసలేని ఆరోపణలు
● డైరెక్టర్ల ఎన్నికల్లో మహేందర్‌రెడ్డి ధర్మాన్ని పాటించలేదు
● నార్మూల్ చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి

యాదాద్రి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మదర్ డెయిరీని నట్టేట ముంచిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని నార్మూల్ చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సోమవారం భువనగిరిలో పాల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో మదర్ డెయిరీకి చేసిన నష్టాలను, తప్పులను కప్పి పుచ్చుకునేందుకు ప్రస్తుత పాలకవర్గంపై నిందలు వేయడం విడ్డూరంగా ఉందన్నారు. తాను చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత రూ.11కోట్ల అప్పులు అయ్యాయని, రైతులకు పాల బిల్లులు ఇవ్వడంలేదని డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి ఆరోపిస్తున్నారని, బీఆర్ఎస్ హయాంలో జరిగిన పొరపాట్లను కప్పి పుచ్చుకునేందుకే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. మదర్ డెయిరీలో అన్యాయాలు, అక్రమాలు జరుగుతున్నాయని పసలేని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. గొంగిడి మహేందర్‌రెడ్డి మదర్ డెయిరీ పాలకవర్గంపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని, నైతిక విలువలు లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. తాను చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంలో రూ.30 కోట్ల మేరకు అప్పులు ఉన్నాయని, వివిధ బ్యాంకుల్లో చేసిన రుణాలకు గానూ నెలకు రూ.5లక్షల వరకు వడ్డీ చెల్లిస్తున్నామని తెలిపారు. సంస్థ లాభాలకు, నష్టాలకు వేర్వేరుగా ఆడిట్‌లను రూపొందించి.. అప్పులకు కూడా ఇన్‌కాం ట్యాక్స్ కట్టిన చరిత్ర బీఆర్ఎస్ నేతలకు దక్కుతుందని విమర్శించారు. నార్మూల్ డైరెక్టర్ల ఎన్నికల్లో గొంగిడి మహేందర్‌రెడ్డి పొత్తు ధర్మాన్ని తుంగలో తొక్కి.. తమ అభ్యర్థుల ఓటమికి కారణం అయ్యారని ఆరోపించారు. బీఆర్ఎస్ నుంచి ఒక రెబల్ అభ్యర్థిని దింపి, అతనికి ఆర్థికంగా సహాయం చేసి...తమ డైరెక్టర్లను ఓటమి పాలయ్యేలా కుట్రలు చేశారని విమర్శించారు. రైతుల పాల బిల్లులు రూ22కోట్ల మేరకు చెల్లించాల్సి ఉందని, అయితే భూ ములు విక్రయించి చెల్లిద్దామంటే బీఆర్ఎస్ నేతలే కోర్టులో కేసు లు వేస్తున్నారని విమర్శించారు. డెయిరీని త్వరలోనే నేషనల్ డెయిరీ డెవెపల్‌మెంట్ కార్పొరేషన్‌కు అప్పగించనున్నామని, వారి ఆధ్వర్యంలో రైతులకు న్యాయం చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో గొల్లపల్లి రాంరెడ్డి, పుప్పాల నర్సింహులు, కర్నాటి జయశ్రీ ఉప్పల్ వెంకట్‌రెడ్డిరాంరెడ్డి, తదతరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నార్మూల్ చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్లు

అర్హులందరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

మర్రిగూడ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): చర్లగూడెం రిజర్వాయర్‌లో ముంపునకు గురైన భూ నిర్వాసితుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందే విధంగా చూడాలని బాధిత చర్లగూడెం భూ నిర్వాసితులు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యానికి వినతి పత్రం అందజేశారు. సోమవారం ఆయన కుదాభక్ష్‌పల్లి గ్రామానికి వచ్చిన సందర్భంగా బాధితులు ఎమ్మెల్సీని కలిశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ గతంలో ఇరిగేషన్ అధికారులు ఇంటింటికీ తిరుగుతూ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి అర్హులుగా గుర్తించి, డీఎల్ఎస్ నెంబర్ కూడా వేశారని తెలిపారు. ప్రస్తుతం ఇప్పుడు అధికారులు అర్‌అండ్‌అర్ ప్రత్యేక ప్యాకేజీకి అనర్హులంటూ పరిహారం అందించడం లేదంటూ, తమకు న్యాయం జరిగే విధంగా చూడాలని వినతి పత్రం అందజేసి వారి సమస్యలను తెలిపారు. ఎమ్మెల్సీ ఆర్డీవో శ్రీదేవితో మాట్లాడారు. బాధిత భూ నిర్వాసితుల వివరాలు తెలుసుకుని, బాధితులకు న్యాయం చేయాలని ఆమెకు సూచించారు. వినతిపత్రం అందజేసినవారిలో కేశవులు, నిరంజన్, శ్రీను, నరసింహ, రాకేష్ పలువురు ఉన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత

మర్రిగూడ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని శివన్నగూడ నీలకంఠ రామస్వామి దేవాలయ చైర్మన్ రాపోలు యాదగిరి అన్నారు. మండలంలోని శివన్నగూడ జడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆసక్తి ఉన్న క్రీడల్లో నైపుణ్యం సాధించాలని సూచించారు. అనంతరం కబడ్డీ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

ప్రభుత్వ పథకాలు వలస కార్మికులకు వర్తింపజేయాలి

నల్లగొండరూరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో పనిచేస్తున్న వలస కార్మికులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సలీం, జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని సుందరయ్య భవనంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణంలో ఉండే పీవోపీ కార్మికులందరూ తమ సమస్యలపై పోరాటం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు సలోజు సైదాచారి, రవీందర్ పాల్గొన్నారు.

అవే సమస్యలు.. అవే బాధలు

'ప్రజావాణి'లో పునరావృతమవుతున్న సమస్యలు

నల్లగొండ (కలెక్టరేట్), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అవే సమస్యలు.. అవే బాధలు వారం వారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో పునరావృతం అవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా క్షేత్రస్థాయిలో అధికారులు సానుకూలంగా స్పందించకపోవడం, నాన్చివేత ధోరణి అవలంబించడం వల్ల బాధితులు ప్రజావాణి చుట్టూ తిరుగుతున్నారు. అందులో వ్యక్తిగత సమస్యలపై హాజరవుతుండగా మరికొందరు వివిధ సామాజిక అంశాలపై తరలివస్తున్నారు.

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఇతర అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమంలో బాధితుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. వాటిలో కొన్నింటిని అక్కడున్న అధికారులతో మాట్లాడి పరిష్కరించగా మరికొన్నింటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు లేఖలు రాశారు.



అక్రమ పట్టాను రద్దు చేయండి



నాకు ఎనిమిది మంది సంతానం. అందులో ముగ్గురు మగ వాళ్లు కాగా ఐదుగురు ఆడవాళ్లు. అందరికీ పెళ్లిళ్లు చేశాను. నా భర్త చనిపోయినప్పటి నుంచి గ్రామంలోని సోదరుడి ఇంటి వద్ద ఉంటున్నాను. నాకు మా గ్రామంలో సర్వే నెంబర్ 1047లో 7 ఎకరాల భూమి ఉంది. ఆ భూమిని నాపెద్ద కుమారుడు, చిన్న కుమారుడు నాకు తెలియకుండానే చెరి మూడెకరాల చొప్పున పట్టా చేసుకున్నారు. దీంతో నాపేరిట కేవలం 1 ఎకరం భూమి మాత్రమే మిగిలింది. ఇటీవల నా కూతుళ్లకు ఆస్తిలో భాగం ఇచ్చేందుకు భూమిలో కొంత భాగం వారి పేరిట పట్టా చేసేందుకు నిర్ణయించుకున్నాను. ఆఫీస్‌కు వెళ్లగా నా పేరుపై ఉన్న భూమిలో 6 ఎకరాలు ఎప్పుడో తన ఇద్దరు కొడుకులు రిజిస్ట్రేషన్ జరిగినట్లు చెప్పడంతో అవాక్కయ్యాను. దీంతో ఉన్న ఎకరం భూమిని కుమార్తెల పేరిపై రిజిస్ట్రేషన్ చేశాను. అయితే విషయం తెలుసుకున్న ఇద్దరు కుమారులు నాపై దాడి చేశారు. దీనిపై గతంలో ఆర్డీవోకు కూడా ఫిర్యాదు చేశాను. అక్రమ పట్టాను రద్దు చేసి తనకు న్యాయం చేయాలి.

- నూనె రాములమ్మ, అంగడి కురుమపల్లి,చింతపల్లి

న్యాయం చేయండి



మాకు మా గ్రామంలో మా నాన్న పేరిట సర్వేనెంబర్ 475/ఏలో 1.03 గుంటల భూమి మా పూర్వీకుల నుంచి సంక్రమించింది. ఆ భూమి కూడా మా ఆధీనంలోనే ఉంది. భూమిని మేమే సేద్యం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాం. అయితే పూర్వపు పహాణీలో మా తాత పేరు తప్పుగా పడింది. దీంతో ఇటీవల జారీ చేసిన డిజిటల్ పాస్ బుక్కులు మాకు ఇవ్వకుండా పెండింగ్‌లో ఉంచారు. ఈ మేరకు అధికారులకు ఫిర్యాదు చేయగా వారు క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. అయినా ఇప్పటి వరకు పాస్ పుస్తకం మంజూరు చేయలేదు. తహసీల్దార్ కార్యాయలం చుట్టూ తిరిగి తిరిగి విసిగిపోయాం. దయచేసి మాకు పాసు పుస్తకం ఇప్పించి న్యాయం చేయండి.

- మైనం అనిల్, రాయిన్‌గూడెం, తిప్పర్తి

ఇందిరమ్మ ఇంటి బిల్లు ఇప్పించండి



మేము నిరుపేద కుటుంబానికి చెందిన తమకు ఇటీవల ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. అధికారుల సూచనల మేరకు ఇంటి నిర్మాణాన్ని బేస్‌మెంట్ లెవల్ వరకు పూర్తి చేశాను. కానీ మొదటి బిల్లు మాత్రం ఇంత వరకు రాలేదు. బేస్‌మెంట్ లెవల్ పూర్తి చేసి దాదాపు రెండు నెలలవుతుంది. బిల్లు గురించి అధికారులను సంప్రదించగా రేపు మాపు అంటూ కాలం వెలిబుచ్చుతున్నారు. చాలా ఇబ్బందిగా ఉంది. దయచేసి బిల్లు మంజూరు చేయండి.

- నాంపల్లి రవళి, గొల్లగూడ, నల్లగొండ

భక్తితోనే మానసిక ప్రశాంతత



మాదారంలో దుర్గామాత విగ్రహం వద్ద పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్

శాలిగౌరారం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): భక్తిభావంతోనే మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. దుర్గాదేవి శరన్న నవరాత్రుల సందర్భంగా మండలంలోని మాదారం, పెర్కకొండారం గ్రామంలో దేవి విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గా మాత వద్ద భక్తులు ఎంతో నిష్ఠతో పూజలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్నగౌడ్, మండల మాజీ అధ్యక్షుడు కట్ట వెంకట్‌రెడ్డి, నాయకులు మామిడి సర్వయ్య, గుండా శ్రీనివాస్, గుజిలాల్ శేఖర్‌బాబు, చంద్రమౌళి, దుబ్బ వెంకన్న, జలందర్, తీగల వెంకన్న, నూక జానయ్య, మాచర్ల అంజయ్య, వెంకన్న పాల్గొన్నారు. అనంతరం చిత్తలూరులో అనారోగ్యానికి గురైన బీఆర్ఎస్ నాయకుడు దాసరి నథానియల్‌ను ఆయన పరామర్శించారు.

బకాయిల వసూళ్ల తర్వాతే వేలం వేయాలి

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బకాయిలు వసూలు చేసిన తర్వాతే కొబ్బరికాయల విక్రయవేలం నిర్వహించాలని దుకాణదారులు, గ్రామస్థులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో కొందరు దుకాణదారులు, నార్కట్‌పల్లి ఎంపీడీవో ఉమేష్‌చారికి మరికొందరు గ్రామస్థులు కొబ్బరికాయల వేలం నిర్వహణపై వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేలంలో పేర్కొన్న నిబంధనలను అవకాశంగా మలుచుకొని గ్రామ పంచాయతీ ఆదాయానికి గండికొట్టేలా వేలందారులు చేస్తున్నారని అన్నారు. టెండర్ విలువలో కొంత మొత్తానికి విలువలేని స్థలాలను జీపీకి మార్టిగేజ్ చేస్తూ మోసం చేస్తున్నారని ఫిర్యాదు చేస్తున్నారు. మూడేళ్లకు పైగా జీపీకి రావాల్సిన టెండర్ బకాయిలు సుమారు 40లక్షలను వసూలు చేసిన తర్వాతే కొబ్బరికాయల విక్రయవేలానికి వెళ్లాలని అన్నారు.

రైతులు సకాలంలో రుణాలు చెల్లించాలి



సమావేశంలో మట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ బాలం నరసింహ

మర్రిగూడ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా సహకార పరపతి సంఘం ద్వారా రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించాలని చైర్మన్ బాలం నరసింహ అన్నారు. మండలంలోని శివన్నగూడలో సోమవారం రైతు సేవా సహకార పరపతి సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకు ముందు సొసైటీ ద్వారా పెట్రోల్ బంక్, సూపర్ మార్కెట్, ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఈ సొసైటీ ద్వారా రైతులు రూ.2కోట్ల వరకు రుణాలు తీసుకున్నారని, రైతులు తీసుకున్నటువంటి రుణాలను పాలకవర్గం రికవరీ చేసి సొసైటీని బలోపేతం చేయాలని సూచించారు. గతంలో కొంతమంది సిబ్బంది సొసైటీకి తెలియకుండా డబ్బులు తీసుకున్నారని, త్వరగా సొసైటీకి చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో సీఈవో మధు, వైస్ చైర్మన్ యాదగిరిరెడ్డి, పాలకవర్గం రవీందర్‌రెడ్డి, రాములు, యాదయ్య, సత్తమ్మ, అంతయ్య, రైతులు మురళి, ఆనందరావు పాల్గొన్నారు.

దేవస్థానానికి రథం బహూకరణ

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానానికి పట్టణానికి చెందిన కిరాణ వ్యాపారి కుటుంబసభ్యులు రథాన్ని బహూకరించారు. ఆలయంలో జరిగే వేడుకలు, ఉత్సవాల సమయాల్లో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తుల ఊరేగింపును పల్లకిలోనే చేయాల్సి వస్తుంది. దీంతో ఆలయ అభివృద్ధి కమిటీ విజ్ఞప్తి మేరకు నార్కట్‌పల్లికి చెందిన రేపాల భాస్కర్ అలివేలుమంగమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు ఈ రథాన్ని బహూకరించారు. ఈ రథాన్ని ఉత్సవాల సమయంలో వాహనసేవతో ఉపయోగించేలా కూడా తయారుచేశారు. పూర్తిగా కర్ర, ఇనుమును మాత్రమే ఉపయోగించి తయారు చేసిన ఈ రథాన్ని సోమవారం ఆలయంలోకి చేర్చారు. విజయదశమి రోజున ప్రత్యేక పూజలనంతరం స్వామి అమ్మవార్ల విగ్రహాల ఊరేగింపుతో రథాన్ని ప్రారంభిస్తామని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ దోసపాటి ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఐతరాజు రమేష్ తెలిపారు.

ఆర్ఎస్ఎస్ శాఖలను గ్రామాలకు విస్తరించాలి

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శాఖలను గ్రామస్థాయిలోకి విస్తరింపజేయాలని దక్షిణ మధ్య క్షేత్ర కిసాన్ సంఘ్ దోనూరి రాము అన్నారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి వంద సంవత్సరవాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం రాత్రి నిర్వహించిన సంఘ్ శతాబ్ది ఉత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. దేశ, సమాజ రక్షణకు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని, ప్రతీ పౌరునిలో దేశభక్తిని నింపడమే మన లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కుర్మిళ్ల రఘు, విభాగ్ సంచాలక్ వెంకటయ్య, జిల్లా సేవ ప్రముఖ్ మన్నెం వెంకట్, ఖండ కార్యవాహ మర్రి హరీష్, వ్యవస్థ ప్రముఖ్ గణగాని వెంకటేశం, గో సేవక్ నడింపల్లి లింగస్వామి, జెనిగె కృష్ణ, సంపత్, బస్తీ ప్రముఖ్ రమేష్, వెంకన్న, స్వయం సేవకులు పాల్గొన్నారు.

మెడికల్ సీటును సాధించిన విద్యార్థినికి సన్మానం

చిట్యాలరూరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలంలోని వెలిమినేడుకు చెంది న మంకాల ఇందు ఎంబీబీఎస్‌లో సీటును సాధించింది. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మేడి కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం ఆమె నివాసంలో శాలువాతో సన్మానించి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వైద్యురాలిగా పేద సామాన్యులకు సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మంకాల రుషి, మేడి రాంచరణ్ తదితరులు పాల్గొన్నారు.

'రేషన్‌బియ్యం కల్తీపై విచారణ చేపట్టాలి'

కేతేపల్లి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సన్నబియ్యం పథకాన్ని కొందరు స్వార్థపరులు నీరుగార్చుతున్నారని చీకటిగూడెం మాజీ సర్పంచ్ కోట వెంకటేశ్వరరావు ఆరోపించారు. మండలకేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలు సైతం సన్నబియ్యం అన్నం తినాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న సన్నబియ్యంలో ఇసుక కలుస్తుందని ఆయన ఆరోపించారు. ఐకేపీ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసే సమయంలో ధాన్యంలో రాళ్లు, ఇసుక, మట్టిపెళ్లలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్న అధికారులు మిల్లర్ల వద్ద నుంచి వచ్చే బియ్యం పరిశీలించకపోవడమేమిటని అన్నారు. సన్నబియ్యంలో వచ్చే ఇసుక రాళ్లకు ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన ప్రశ్నించారు. ఈ విషయమై సంబంధిత అధికారులు విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రామచంద్రం పార్టీకి చేసిన సేవలు ఎనలేనవి

మర్రిగూడ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఐతగోని రామచంద్రం పార్టీకి చేసిన సేవలు ఎనలేనివని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు అన్నారు. మండలంలోని ఖుదాభక్ష్‌పల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. రామచంద్రం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం పోరాటం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల ఇన్‌చార్జి కన్వీనర్ బుర్ర శేఖర్, నాయకులు సురేష్, పాండు రంగారావు, యాదగిరిరెడ్డి, బిక్షంరెడ్డి, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవిగా అమ్మవారి దర్శనం



నల్లగొండ పట్టణంలోని రాక్ హిల్స్ కాలనీలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అర్చకులు

నల్లగొండకల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీదేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 8వ రోజైన సోమవారం పట్టణంలోని పలు మండపాల్లో అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చక స్వాములు అమ్మవారిని మారేడుపత్రి, లిల్లీపూలు, తెలుపు వస్త్రాన్ని ధరింపజేసి పరమాన్నం, ఆటుకులు, బెల్లం నైవేద్యంగా సమర్పించి శ్రీ సరస్వతీదేవిగా అలంకరించారు. నల్లగొండ పట్టణంలో పాటు జిల్లాలోని పలు మండలాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో భక్తులు భక్తి శ్రద్ధలతో అమ్మవారిని పూజించారు. దీంతో మండపాలన్నీ భక్తులతో సందడి చేశాయి, కొన్ని మండపాల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నార్కట్‌పల్లి, చిట్యాల మండలాల్లో దుర్గామాత మంటపాల వద్ద చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. పలకలు, బలపాలు, నోటు బుక్స్ పంపిణీ చేశారు. అనంతరం మండపం వద్దకు వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

కనగల్ మండలం దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ అమ్మవారు సరస్వతిదేవిగా దర్శనమిచ్చారు. ఉదయం అర్చకులు అమ్మవారికి విశేషలంకరణ చేసి అభిషేక, అష్టోత్తర పూజలను ఘనంగా నిర్వహించారు. ఇదిలావుంటే ఉంటే అమ్మవారి సన్నిధిలో పలువురు చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో నాగిరెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంటు జినుకుంట్ల చంద్రయ్యగౌడ్, నాగేశ్వర్‌రావు, ఉపేందర్‌రెడ్డి, ముఖ్య అర్చకులు మల్లాచారి, శ్రవణ్‌చార్యులు, మహేష్, దామోదర్, ఫణి, శ్రీను పాల్గొన్నారు.

వైభవంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

నల్లగొండ జిల్లాలో సద్దుల బతుకమ్మ ఉత్సవాలు సోమవారం రాత్రి అంబరాన్ని తాకాయి. చి న్నా పెద్దా అనే తేడా లేకుండా బతుకమ్మలను ఆకర్షణీయంగా, అందంగా పేర్చి తీసుకువచ్చారు. అనంతరం బతుకమ్మల చుట్టూ ఆడిపాడారు. అనంతరం బతుకమ్మలను ప్రత్యేక వాహనంలో తీసుకువెళ్లి సమీపంలోని కాల్వల్లో నిమజ్జనం చేశారు. ఆలయకమిటి నిర్వాహకులు బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు చేశారు.



నల్లగొండ పట్టణంలోని శ్రీనగర్‌కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



రాక్‌హిల్స్ కాలనీలో



బతుకమ్మ తీసుకువస్తున్న మహిళలు



బతుకమ్మ ఆడుతున్న రెడ్డికాలనీ మహిళలు



డీసీసీబీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పూజలు చేస్తున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది

మోగిన స్థానిక నగారా

(5వ పేజీ తరువాయి)


అధికారులను నియమించగా, ఆరుగురిని అదనంగా అందుబాటులో ఉంచారు. అదేవిధంగా ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి ఒక్కో దశలో 140 మంది చొప్పున రిటర్నింగ్ అధికారులను నియమిస్తున్నారు. అదేవిధంగా ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి 935 లొకేషన్లలో 1,957 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తుండగా, 2,348 మంది పోలింగ్ అధికారులు, 10,982 మంది ఇతర పోలింగ్ సిబ్బందిని నియమించారు. వీరితో పాటు మైక్రో అబ్జర్వర్లు, జోనల్ అధికారులను నియమించగా, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాలను నియమిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మూడు దశల్లో 869 గ్రామపంచాయతీలు, 7,494 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. ప్రతీ వార్డుకు ఒక పోలింగ్‌స్టేషన్ చొప్పున ఏర్పాటు చేస్తారు. అదేవిధంగా ప్రతీ పోలింగ్‌స్టేషన్‌లో ఒక పోలింగ్ అధికారి, ఇద్దరు అదనపు సిబ్బందిని నియమిస్తారు. పరిషత్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన వారినే సర్పంచ్ ఎన్నికలకూ వినియోగిస్తారు.

బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు సిద్ధం

పంచాయతీరాజ్ ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందే జిల్లా యంత్రాంగం బ్యాలెట్ బాక్సులను, బ్యాలెట్ పత్రాలను తయారు చేసిం ది. పరిషత్, పంచాయతీ ఎన్నికలకు సంబంధించి 9,996 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశారు. పార్టీల ప్రాతిపదికన పరిషత్ ఎన్నికలు జరగనుండడంతో జడ్పీటీసీ స్థానాలకు తెలుపు రంగు బ్యాలెట్ పత్రాలు, ఎంపీటీసీ స్థానాలకు పింకు రంగు బ్యాలెట్ పత్రాలు అవసరమైనంత మేర ప్రచురణకు సిద్ధంగా అందుబాటులో ఉంచారు. గ్రామపంచాయ తీ సర్పంచ్ స్థానాలకు పింక్ రంగు బ్యాలెట్ పత్రాలు, వార్డు మెంబర్ స్థానాలకు తెలుపు రంగు బ్యాలెట్ పత్రాలు సిద్ధం చేశారు.

సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు

జిల్లాలో పోలింగ్‌స్టేషన్లలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడ అదనపు పోలీస్ బందోబస్తు వినియోగించాలని నిర్ణయించారు. 652 సమస్యాత్మక పోలింగ్‌స్టేషన్లను గుర్తించగా, 304 సున్నితమైన ప్రాంతాలుగా, మరో 18 అతి సున్నితమైన ప్రాంతాలుగా గుర్తించారు. ఇక్కడ అదనపు పోలీస్ బలగాలను నియమించడంతో పాటు, రౌడీషీటర్ల బైండోవర్లు, పాతకేసుల నిందితులపై కన్నేసి ఉంచుతామని పోలీసు అధికారులు తెలిపారు.



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	585.30 (298.3005)	5,91,456	5,91,456
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.47 (4.06)	9,152.18	7,994.18
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	169.814	5,92,610	5,69,340

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.210



మోగిన స్థానిక సంస్థల ఎన్నికల నగారా

స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగింది. రెండు విడతల్లో పరిషత్ ఎన్నికలు, మూడు విడతల్లో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. రాష్ట్రంలోనే అతిపెద్ద జిల్లా అయిన నల్లగొండలో అదే స్థాయిలో ఎన్నికలు నిర్వహించేందుకు కలెక్టర్ ఇలా త్రిపాఠి నేతృత్వంలో అధికారయంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది.

\- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

జడ్పీటీసీ స్థానాలు	33
ఎంపీటీసీ స్థానాలు	353
పోలింగ్ స్టేషన్లు	1957
పంచాయతీలు	869
వార్డులు	7494
పురుష ఓటర్లు	5,30,860
మహిళా ఓటర్లు	5,42,589
ఇతరులు	57
మొత్తం ఓటర్లు	10,73,506

- ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేసిన యంత్రాంగం
- ప్రవర్తనా నియమావళి అమలులోకి
- అక్టోబరు 9 నుంచి నవంబరు 11 వరకు ఎన్నికల సందడి

జిల్లాలో 33 జడ్పీటీసీ స్థానాలకు, 353 ఎంపీటీసీ స్థానాలకు రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. 869 గ్రామపంచాయతీల్లో 7,494 వార్డులకు మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం ఐదు దశల ఎన్నికలకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. దసరా తర్వాత అక్టోబరు 9వ తేదీన పరిషత్ ఎన్నికల మొదటి విడత నోటిఫికేషన్ విడుదలతో నామినేషన్ల ఘట్టం ప్రారంభమై, నవంబరు 11న జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల ఓట్ల లెక్కింపు పూర్తయ్యేంతవరకు జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉండనుంది. ఈ ఎన్నికల్లో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం 10,73,506 మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల ఎన్నికలకు ఉదయం 7నుంచి సాయంత్రం 5గంటలవరకు పోలింగ్ నిర్వహించనుండగా, గ్రామపంచాయతీ సర్పంచ్,వార్డు సభ్యుల పోలింగ్ను ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2గంటలకు ముగిస్తారు. పంచాయతీ ఎన్నికల్లో అదే రోజు ఓట్ల లెక్కింపు చేపడతారు.

రెండు విడతల్లో పరిషత్ ఎన్నికలు

జిల్లాలో పరిషత్ ఎన్నికలు రెండు విడతల్లో నిర్వహించనున్నారు.మొదటి విడతలో నల్లగొండ, దేవరకొండ డివిజన్లలోని 18 జడ్పీటీసీ,196 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. రెండో విడతలో చండూరు, మిర్యాలగూడ డివిజన్లలోని 15జడ్పీటీసీ, 157 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు పోటీచేసే అభ్యర్థుల నామినేషన్లను మండల పరిషత్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసే ఎన్నికల అధికారి తీసుకుంటారు.

మూడు విడతల్లో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు

గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహిస్తారు. మొదటి విడతలో నల్లగొండ, చండూరు డివిజన్లలోని 14 మండలాల్లోని 318 పంచాయతీలు, 2,870 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తారు. రెండో విడతలో మిర్యాలగూడ డివిజన్‌లోని 10 మండలాల్లోని 282 గ్రామపంచాయతీలు, 2,418 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. మూడో విడతలో దేవరకొండ డివిజన్‌లోని తొమ్మిది మండలాలకు 269 గ్రామ పంచాయతీలు, 2,206 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తారు.

పోలింగ్ సిబ్బంది నియామకాలు..

జిల్లాలో పరిషత్ ఎన్నికలకు జడ్పీటీసీస్థానాలకు ఒక్కో స్థానానికి ఒక్కొక్కరు చొప్పున 33మంది రిటర్నింగ్..

మిగతా 8వ పేజీలో...

పరిషత్ ఎన్నికలు రెండు విడతల్లో..

విడత	నామినేషన్ల స్వీకరణ	నామినేషన్ల పరిశీలన	అభ్యంతరాల స్వీకరణ	నామినేషన్ల ఖరారు	నామినేషన్ల ఉపసంహరణ	పోలింగ్ తేదీ	మండలాలు స్థానాలు	జడ్పీటీసీ స్థానాలు	ఎంపీటీసీ స్థానాలు	మొత్తం ఓటర్లు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	పోలింగ్ కేంద్రాలు
తొలి	అక్టోబరు 9	12న	13న	14న	15న	23న	18	18	196	6,00,316	2,98,048	3,02,241	1,099
రెండో	అక్టోబరు 13	16న	17న	18న	19న	27న	15	15	157	473190	2,32,812	2,40,348	858

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి



స్థానిక ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్‌లో రాణీ కుముదిని,పాల్గొన్న కలెక్టర్

రాష్ట్ర ఎన్నికల అధికారి రాణికుముదిని

నల్లగొండ(కలెక్టరేట్), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి: స్థానిక సంస్థలకు రెండు విడతల్లో ఎన్నికలు ఉంటాయని, ఎన్నికల కోడ్ కూడా అమలులో ఉంటుందని రాష్ట్ర ఎన్నికల అధికారి రాణికుముదిని అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో రెండు దఫాలుగా పరిషత్ ఎన్నికలు, మూడు దఫాలుగా సర్పంచ్ ఎన్నికలు ఉంటాయన్నారు. స్థానిక ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకొని సిద్ధంగా ఉండాలని, ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణకు 996 బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉన్నాయని, ఆర్‌వో, ఏఆర్‌వోలకు శిక్షణ ఇచ్చామన్నారు. ఈనెల 30న రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించానున్నామని తెలిపారు. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలను ఏర్పాటు చేస్తున్నామని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ, ఎన్నికలకు సంబంధించి పోలీస్‌పరంగా అవసరమైన బందోబస్తు ఏర్పాట్లు చేయడమేగాక, సరిహద్దు చెక్‌పోస్టులను పటిష్ఠం చేస్తామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్‌అమిత్, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఏఎస్పీ మౌనిక, జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, ఆర్డీవోలు వై.అశోక్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి, డీఈవో భిక్షపతి, ఆర్డీవో పాల్గొన్నారు.

అమలులోకి ఎన్నికల ప్రవర్తనా నియమావళి : కలెక్టర్

రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినందున తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వపరంగా ప్రజాప్రతినిధులతో కలిసి ఎలాంటి అధికారిక కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా రాజకీయ పార్టీలకు సంబంధించిన, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన హోర్డింగులు, కటౌట్లు, పోస్టర్లు, బ్యానర్లు ఉండకూడదన్నారు. అదేవిధంగా ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు తెలిపారు. నవంబరు 11 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకొని మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండక్రైం,సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజలకు పోలీస్‌శాఖను మరింత చేరువచేయడమే లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో వివిధ ప్రాంతాల నుంచి 25 మంది అర్జీదారుల ఫిర్యాదులు తీసుకొని వారితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి బాధితులకు సత్వర న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, బాధితుల సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు తీసుకోవాలన్నారు. సంబంధిత ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి న్యాయం చేయాలన్నారు.

పౌరసరఫరాల సంస్థ డీఎం బాధ్యతల స్వీకరణపై డైలమా

ఎన్నికల కోడ్‌తో సందిగ్ధం

నల్లగొండ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా పౌరసరఫరాలశాఖ కొత్త డీఎం బాధ్యతల స్వీకరణ డైలమాలో పడింది. ఇక్కడ డీఎంగా పనిచేసిన హరీష్‌ను బదిలీ చేసి ఆయన స్థానంలో రంగారెడ్డి జిల్లాకు చెందిన గోపిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే బాధ్యతల స్వీకరణకు ఎన్నికల కోడ్ అడ్డం రావడంతో నిలిపివేసినట్టు సమాచారం. అదేవిధంగా ప్రస్తుతం డీఎంగా ఉన్న హరీష్ రిలీవ్‌ను కూడా నిలిపివేసినట్లు తెలిసింది. డీఎంగా బాధ్యతలు తీసుకునేందుకు రంగారెడ్డి జిల్లా నుంచి గోపి సోమవారం రాగా, ఎన్నికల షెడ్యూల్ రావడంతో ఆయనకు ఉన్నతాధికారులు బాధ్యతలు అప్పగించలేదని వినికిడి.

అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయండి

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి



కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్న పాఠశాలల నుంచి అవసరం ఉన్న పాఠశాలకు అదే కాంప్లెక్స్ లేదా అదే మండలంలో సర్దుబాటు చేయాల్సి ఉండగా, ఈ నిబంధనలను అధికారులు విస్మరించారన్నారు. అక్రమాలకు తావులేకుండా, నిబంధనలను పాటించి సర్దుబాటు చేయాలని విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే డీఈవోను కలిసి విన్నవించామన్నారు. కానీ జిల్లాలో ఎలాంటి ఉత్తర్వులు లేకుండా మౌఖిక ఆదేశాలతో కొంతమంది ఉపాధ్యాయులను, ఉత్తర్వులు ఇచ్చి మరి కొంతమంది ఉపాధ్యాయులను అక్రమంగా డిప్యూటేషన్‌లో కొనసాగిస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో ఇష్టారాజ్యంగా కొనసాగుతున్న అక్రమ డిప్యూటేషన్ల వ్యవహారంపై కలెక్టర్ వెంటనే స్పందించి రద్దుచేయాలని డిమాండ్ చేశారు. సమావేశం అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బక్కా శ్రీనివాసాచారి, నాగమణి, పెరుమాళ్ల వెంకటేశం, నర్రా శేఖర్‌రెడ్డి, వడిత్య రాజు, ఎడ్ల సైదులు, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, గేర నరసింహ, నలపరాజు వెంకన్న, పగిళ్ల సైదులు, కొమర్రాజు సైదులు, ఎం.చిన్నవెంకన్న, కోట్ల యాదగిరి, మురళయ్య, టి.నరసింహమూర్తి, మధుసూదన్, పి.నరసింహ, శ్యామ్‌కుమార్, ఆర్.రాకేశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సద్దుల బతుకమ్మ



జిల్లావ్యాప్తంగా సద్దుల బతుకమ్మ వేడుకలు వైభవంగా జరిగాయి. సోమవారం సాయంత్రం గ్రామ, పట్టణ ప్రధాన కూడళ్లతో పాటు చెరువులు, కుంటల సమీపాల్లో బతుకమ్మలను ఏర్పాటు చేసి, గౌరమ్మకు పూజలు చేసి బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు. 8

సరస్వతీ నమస్తుభ్యం



దేవీనవరాత్రోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా చిన్నారులు విద్యాబుద్ధులు ప్రసాదించాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 6

బీఆర్ఎస్ నేతలు చర్చకు రావాలి

ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్

వచ్చే ఎన్నికల్లో మంత్రి కోమటిరెడ్డి లక్ష ఓట్లతో గెలుస్తారు : గుమ్మల



బీఆర్ఎస్ అలియాస్ టీఆర్ఎస్ బాకీ, వడ్డీకార్డు విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ శంకర్ నాయక్, గుమ్మల మోహన్‌రెడ్డి

నల్లగొండ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అధికారం కోల్పోయిన తరువాత బీఆర్ఎస్ నాయకులు సోయి లేకుండా మాట్లాడుతున్నారని జగదీష్ రెడ్డి తిప్పర్తిలో ఆరు గ్యారంటీలపై విడుదల చేసిన కార్డుపై బీఆర్ఎస్ నేతలకు నల్లగొండ గడియారం సెంటర్‌కు చర్చకు రావాలని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేతావత్ శంకర్‌నాయక్ సవాల్ విసిరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డితో కలిసి బీఆర్ఎస్ అలియాస్ టీఆర్ఎస్ బాకీ, వడ్డీ కార్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగదీష్ రెడ్డి ఇదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎర్రగడ్డలో, జగదీష్‌రెడ్డిని నల్లగొండ గొల్లగూడ ఆస్పత్రిలో చేర్పిస్తామన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ ఎటువంటి అభివృద్ధి పనులు చేయకుండా ప్రాజెక్టుల పేరుతో పేద ప్రజల సొమ్మును దోచుకుందని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయిన తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. ఎస్సీలకు మూడు ఎకరాలు పంపిణీ చేస్తామని చెప్పి బాకీ పడ్డారని, రైతులకు రుణమాఫీకి సంబంధించి వడ్డీ బాకీ గత ప్రభుత్వంపై ఉందన్నారు. నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు బాకీ పడిందని, ప్రజలకు డబుల్‌బెడ్‌రూం బాకీ ఉందన్నారు. వీటన్నంటినీ విస్మరించి ప్రజలను మోసం చేశారన్నారు. ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పటిష్ఠంగా ఉందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదన్నారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి మాట్లాడుతూ, గత ఎన్నికల్లో 50వేలకు పైగా మెజార్టీతో గెలిచిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. పట్టణంతోపాటు నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, నాయకులు పాశం సంపత్‌రెడ్డి, గడ్డం అనూప్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, షబ్బీర్‌బాబా, కార్తీక్, నాగరాజు, నవీన్ గౌడ్, యాదగిరి, అంజి, చిట్టి, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల కమీషన్ ఇవ్వాలి

డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రేషన్‌డీలర్లు

నల్లగొండ (కలెక్టరేట్), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లకు రావాల్సిన కమీషన్‌ను వెంటనే విడుదల చేయాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పారెపల్లి నాగరాజు, ప్రధాన కార్యదర్శి వైద్యుల సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఏప్రిల్ మాసం నుంచి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి కమీషన్ రాక డీలర్లు ఇబ్బందులు ఎదుర్కుంటున్నారన్నారు. డీలర్ల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కమీషన్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తూకాల్లో తేడాలు ఉంటున్నాయని, గోదాముల నుంచి దుకాణాలకు చేరే సరికి 50కిలోల బస్తాలో రెండు నుంచి మూడు కిలోల తరుగు ఉంటుందన్నారు. దీంతో తనిఖీ అధికారులు వచ్చినప్పుడు స్టాకుల్లో తేడాలు వస్తున్నాయని, ఫలితంగా అధికారులు కేసులు నమోదు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద వేబ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డీలర్లకు గౌరవ వేతనం, కమీషన్‌ను రూ.300కు పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.సత్యనారాయణ, బోల్ల వేణుగోపాల్‌రావు, సముద్రాల యాదగిరి, మచ్చ నాగరాజు, హఫీజ్, సలీం, మునీందర్‌రావు, విజయ్‌కుమార్, కలీం, సరిత, బాల్‌రెడ్డి, అంతటి శ్రీనివాస్, నర్సింహ, పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

సీపీఎం నేత జూలకంటి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం దొడ్డికొమరయ్య భవనంలో నిర్వహించిన పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరంతరం ప్రజల కోసం పోరాటాలు చేసే సీపీఎం శ్రేణులను ప్రజలు అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ ప్రక్రియ సక్రమంగా జరగలేదని, పలు స్థానాల్లో అవకతవకలు జరిగాయని, వాటిని వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజాపాలన పేరుతో కాలయాపన చేస్తున్నారని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం, మంత్రివర్గం పట్టించుకోవడం లేదన్నారు. వానాకాలం సీజన్ వరి కోతలు ప్రారంభంకానున్నాయని, వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పత్తిపై కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం ఎత్తివేయడంతో ధర తగినంత రాదని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే సీసీఐ కేంద్రాలను తెరవాలన్నారు. త్రిబుల్‌ఆర్ పాత అలైన్‌మెంట్ ప్రకారం భూసేకరణ చేయాలని, నిర్వాసితులకు బహిరంగ మార్కెట్ ధర చెల్లించాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, నాయకులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నారి అయిలయ్య, బండా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, కందాల ప్రమీల, సయ్యద్ హాషం, పాలడుగు ప్రభావతి, చినపాక లక్ష్మీనారాయణ, వీరెపల్లి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

'లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనడం రాజ్యాంగ విరుద్ధం'

మిర్యాలగూడ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనడం రాజ్యాంగ వ్యతిరేకమని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర సహాయకార్యదర్శి రవినాయక్ అన్నారు. పట్టణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 50 సంవత్సరాలుగా ఎస్టీ జాబితాలో ఉన్న లంబాడీ, గిరిజనులను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేయడం శోచనీయమని అన్నారు. గిరిజన తెగల మధ్య ఘర్షణను సృష్టించి లబ్ధి పొందేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు.

దేవరకొండలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

దేవరకొండ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్‌లో సద్దుల బతుకమ్మ వేడుకలను సోమవారం రాత్రి మహిళలు ఆనందోత్సవాలతో నిర్వహించారు. నూతన వస్త్రాలు ధరించి తంగెడుతో పాటు వివిధ రకాల పూలతో బతుకమ్మలు పేర్చి దేవాలయాల వద్దకు తీసుకువచ్చి బతుకమ్మ ఆటలు ఆడారు. పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి, అయ్యప్పస్వామి దేవాలయం, కోదండరామాలయంతో పాటు పలు కాలనీల్లో దుర్గాదేవి విగ్రహాల ఎదుట మహిళలు బతుకమ్మ ఆటలు ఆడారు.

గుండెను పదిలంగా కాపాడుకోవాలి

• డాక్టర్ ముప్పా రామారావు


డాక్టర్ రామారావు

మిర్యాలగూడ, సెప్టెంబరు 29(ఆంధ్రజోతి): హార్ట్‌స్ట్రోక్‌తో మరణించే వారి సంఖ్య ఇటీవల ఎక్కువగా ఉందని, ప్రతి ఒక్కరూ గుండెను పదిలంగా కాపాడుకునేలా జాగ్రత్తలు వహించాలని డాక్టర్ ముప్పా రామారావు అన్నారు. వరల్డ్ హార్ట్‌డే సందర్భంగా సోమవారం జ్యోతి ఆస్పత్రిలో గుండె పరీక్షల ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు పరీక్షల ద్వారా గుండె జబ్బులను గుర్తించవచ్చని అన్నారు. క్యాంపులో వంద మందికి పైగా 2 డీ ఈకో, ఈసీజీలు, 10మందికి యాంజియోగ్రామ్ చేసినట్లు తెలిపారు, క్యాంపులో డాక్టర్లు వెంకటేష్, శ్రీహర్ష వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేసులను సత్వరమే పరిష్కరించాలి : డీఎస్పీ

వేములపల్లి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సాంకేతికతను వినియోగించుకుంటూ కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు నుంచి గౌరవవందనం స్వీకరించిన ఆయన స్టేషన్ పరిసరాలను, పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన స్టేషన్ పరిధిలోని క్రైమ్ రేటు, పలు నేరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. డ్రంకన్ డ్రైవ్, ఇతర ప్రమాదాల్లో పట్టుబడిన వాహనాలను ఆయన పరిశీలించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా చూడాలని, గ్రామాల్లో ఎలాంటి అసాంఘిక చర్యలకు పాల్పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట సీఐ పీఎన్‌డీ. ప్రసాద్, పోలీస్‌సిబ్బంది ఉన్నారు.





మోగిన స్థానిక నగారా

(5వ పేజీ తరువాయి)

అధికారులను నియమించగా, ఆరుగురిని అదనంగా అందుబాటులో ఉంచారు. అదేవిధంగా ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి ఒక్కో దశలో 140 మంది చొప్పున రిటర్నింగ్ అధికారులను నియమిస్తున్నారు. అదేవిధంగా ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి 935 లొకేషన్లలో 1,957 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తుండగా, 2,348 మంది పోలింగ్ అధికారులు, 10,982 మంది ఇతర పోలింగ్ సిబ్బందిని నియమించారు. వీరితో పాటు మైక్రో అబ్జర్వర్లు, జోనల్ అధికారులను నియమించగా, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాలను నియమిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా మూడు దశల్లో 869 గ్రామపంచాయతీలు, 7,494 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. ప్రతీ వార్డుకు ఒక పోలింగ్‌స్టేషన్ చొప్పున ఏర్పాటు చేస్తారు. అదేవిధంగా ప్రతీ పోలింగ్‌స్టేషన్‌లో ఒక పోలింగ్ అధికారి, ఇద్దరు అదనపు సిబ్బందిని నియమిస్తారు. పరిషత్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన వారినే సర్పంచ్ ఎన్నికలకూ వినియోగిస్తారు.

బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు సిద్ధం

పంచాయతీరాజ్ ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందే జిల్లా యంత్రాంగం బ్యాలెట్ బాక్సులను, బ్యాలెట్ పత్రాలను తయారు చేసింది. పరిషత్, పంచాయతీ ఎన్నికలకు సంబంధించి 9,996 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశారు. పార్టీల ప్రాతిపదికన పరిషత్ ఎన్నికలు జరగనుండడంతో జడ్పీటీసీ స్థానాలకు తెలుపు రంగు బ్యాలెట్ పత్రాలు, ఎంపీటీసీ స్థానాలకు పింకు రంగు బ్యాలెట్ పత్రాలు అవసరమైనంత మేర ప్రచురణకు సిద్ధంగా అందుబాటులో ఉంచారు. గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానాలకు పింక్ రంగు బ్యాలెట్ పత్రాలు, వార్డు మెంబర్ స్థానాలకు తెలుపు రంగు బ్యాలెట్ పత్రాలు సిద్ధం చేశారు.

సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు

జిల్లాలో పోలింగ్ స్టేషన్లలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడ అదనపు పోలీస్ బందోబస్తు వినియోగించాలని నిర్ణయించారు. 652 సమస్యాత్మక పోలింగ్‌స్టేషన్లను గుర్తించగా, 304 సున్నితమైన ప్రాంతాలుగా, మరో 18 అతి సున్నితమైన ప్రాంతాలుగా గుర్తించారు. ఇక్కడ అదనపు పోలీస్ బలగాలను నియమించడంతో పాటు, రౌడీషీటర్ల బైండోవర్లు, పాతకేసుల నిందితులపై కన్నేసి ఉంచుతామని పోలీసు అధికారులు తెలిపారు.


బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


దేవరకొండలో సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

బతుకమ్మ పండుగ ప్రత్యేకమైనది

• ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పండుగల్లో బతుకమ్మ పండుగ ప్రత్యేకమైనదని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని పలు ఆలయ ప్రాంగణాలు, ప్రధాన కూడళ్ల, క్రీడామైదానాలలో పెద్దఎత్తున సద్దుల బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. పలు కాలనీల్లో నిర్వహించిన వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు, బాలికలు ఉత్సాహంగా ఆటలాడుతూ, పాటలు పాడుతూ గౌరీదేవిని పూజిస్తారని, సంస్కృతీ, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ ఉత్సవాలు నిర్వహిస్తారని తెలిపారు.

